Follow: @ANNTELUGU
09-09-2026
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 231 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



తెలుగు ఇండస్ట్రీలో మరో ప్రామిసింగ్ స్టార్
## శ్రీనాథ్ మాగంటి

- హిట్, యానిమల్, లక్కీ భాస్కర్ లతో లక్కీ యాక్టర్ గా గుర్తింపు
- ఈఎన్ఈ-2 కెరీర్ కు టర్నింగ్ పాయింట్ అవుతుందన్న అంచనా

**మహా:** తెలుగు ఇండస్ట్రీలో.. మరో ప్రామిసింగ్ హీరోగా శ్రీనాథ్ మాగంటి నిలదొక్కుకుంటారు. హిట్, యానిమల్, లక్కీ భాస్కర్ వంటి సూపర్ హిట్ మూవీస్ లలో నటించి.. తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకున్న శ్రీనాథ్ త్వరలో వచ్చే ఈనగరానికి ఏమైంది 2లో విశ్వక్ సేన్ తో కలిసి లీడ్ రోల్ ప్లే చేస్తున్నాడు. ఈ సినిమా శ్రీనాథ్ కెరీర్ కు టర్నింగ్ పాయింట్ అవుతుందన్న అంచనాలు ఇండస్ట్రీలో ఉన్నాయి. ఇటు తెలుగులోనే కాకుండా పౌత్, నార్త్ ఏ ఇండస్ట్రీ అయినా ఓన్ చేసుకునే టాలెంట్, అప్పీయరెన్స్ శ్రీనాథ్ సొంతం. 'హిట్, యానిమల్, లక్కీభాస్కర్ మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

### ట్రంప్ హ్యాట్రిక్ ప్లాన్



- మూడోసారి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్?
- వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికై.. ప్రెసిడెంట్ తో రాజీనామా చేయించే ప్లాన్

02

### టీడీపీలోకి బొత్స మేనల్లుడు



- వైసీపీకి బిగ్ షాక్
- కుమార్తెతో కలిసి చంద్రబాబు సమక్షంలో చేరిక
- వైసీపీ పదవులకు ఇప్పటికే శ్రీను రాజీనామా

02

### శాంసంగ్ కీలక నిర్ణయం



- భారత్‌లో లేఆఫ్స్
- 100 ఉద్యోగాల తొలగింపు

02

# కేసీఆర్ కేంద్రంగా.. రచ్చ



**కాకతాళీయం కాదు.. ఫామ్ హౌస్‌లో చేసిన కుట్ర**

**స్పీకర్ కు అవమానంపై డిప్యూటీ సీఎం భట్టి**

కేసీఆర్ క్షమాపణలు చెప్పాలని తీర్మానం

కేసీఆర్ ఫామ్ హౌజ్ వద్దకు దూసుకెళ్ళిన కాంగ్రెస్ శ్రేణులు

రాళ్ళదాడిలో కాంగ్రెస్ గజ్వేల్ ఇన్ ఛార్జి నర్సారెడ్డికి తీవ్ర గాయాలు

**ఎర్రవెల్లికి వెళ్తున్న కేటీఆర్, హరీష్, పల్లా సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్**

సభలో హరీష్ రావుపై భగ్గుమన్న స్పీకర్..

ఇది నా తల్లికి జరిగిన అవమానం అంటూ ఆవేదన

కౌన్సిల్ నుండి ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిల సస్పెన్షన్

ముఖ్యమంత్రి పై కేటీఆర్ అసభ్య పదజాలం..

కేసీఆర్ చావు కోరుతున్నామన్న షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్

సభలో.. బయటా అదే అదే రగడ..

రోడ్లపై బీఆర్ఎస్ నేతల పరుగులు.. ఎక్కడికక్కడ అరెస్ట్ లు

(హైదరాబాద్ మహా): తెలంగాణ అసెంబ్లీ దగ్గర సోమవారం జరిగిన ఘటన కాకతాళీయం కాదని.. ఫామ్ హౌస్‌లో పురుడు పోసుకున్న కుట్ర అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. స్పీకర్‌ను అవమానించటం అంటే.. ఒక వ్యక్తిని అవమానించినట్లు కాదని.. సభ మొత్తాన్ని అవమానించినట్లే అన్నారు. కేసీఆర్ క్షమాపణలు చెప్పాలని అసెంబ్లీలో తీర్మానం చేశారు. స్పీకర్ ను అవమానిస్తూ బూతులు దూషించిన ఎమ్మెల్సీ తాతా మధుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం ప్రదర్శిస్తూ చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. అంతకుముందు మహిళా ఎమ్మెల్యేలకు అవమానం జరిగిందంటూ క్షమాపణ చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేయగా, దానిపై నివేదిక రాగానే చర్య తీసుకుంటామని.. తన తల్లికి జరిగిన అవమానంపై సమాధానం చెప్పాలని స్పీకర్ హరీష్ రావు పై భగ్గుమన్నారు. మరోవైపు కేసీఆర్ క్షమాపణలు చెప్పాలంటూ ఫామ్ హౌజ్ వద్దకు కాంగ్రెస్ శ్రేణులు దూసుకెళ్ళడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్ళు విసిరారు. రాళ్ళదాడిలో గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి నర్సారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. నిమ్స్ లో చికిత్స పొందుతున్నారు. మరోవైపు తెల్లవారు జామునే అరెస్టయిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలు హైకోర్టు ఆదేశాలతో విడుదల కాగా, ఈ సెషన్ వరకు కౌన్సిల్ కు రాకుండా మిగతా 2వ పేజీలో



# అక్రమ నిర్మాణాలు కూల్చేదెన్నడు..!

## నోటీసులు జారీ చేసినా ఆగని అక్రమం ...!

- ఖానామెట్ ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో యథేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణాలు...!
- 8 వ అంతస్తుకు వడివడిగా సన్నాహాలు...!
- స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఉన్నట్టా... లేనట్టా..!
- డెమాలిషన్ ఆర్డర్లు బుట్టదాఖలేనా..!
- పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తున్న అధికార యంత్రాంగం...!
- పెద్దోళ్ల భవనాలు కూల్చాలంటే జంకెందుకు..!
- అక్రమ నిర్మాణాలతో భ్రష్టు పట్టిన సిఎంసీ...!
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరే సమాధానం చెప్పాలంటున్న స్థానికులు...!
- సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలి...!

02

అక్రమ నిర్మాణాలకు ఎటువంటి నోటీసులు జారీ చేయకుండానే కూల్చివేతలు జరపాలని న్యాయస్థానాలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. ఆ ఆదేశాలను పెడచెవిన పెడుతున్న అధికార యంత్రాంగం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. అధికారుల అండదండలతో ప్రభుత్వ భూముల్ని ఆక్రమించి యథేచ్ఛగా బహుళ అంతస్థుల నిర్మాణాలు కొనసాగిస్తుంటే అడ్డుకోవాల్సిన మున్సిపల్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడంపై బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు నోటీసులతో కాలయాపన చేస్తుండటంతో, ఖానామెట్ ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో నిబంధనలను బేఖాతరు చేస్తూ 7 ఫ్లోర్లు పూర్తి చేసి 8 వ ఫ్లోర్ కు వడి వడిగా సన్నాహాలు చేస్తున్నారని సిఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టుంచుకునే నాదుడే లేడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణమని కూల్చాలంటూ గత నెల 18 న స్పెషల్ టాస్క్ ఫోర్స్ కి సిఎంసీ కమిషనర్ శ్రీజన స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఆ ఆదేశాలు ఆచరణకు నోచుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సామాన్యుల ఇళ్లను కూల్చేందుకు బ్రహ్మాస్త్రాలను ప్రయోగిస్తున్న అధికార యంత్రాంగం, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్న 'పెద్దోళ్ల' జోలికి వెళ్లడానికి ఎందుకు జంకుతోందంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు నగరంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఉందా? లేదా? ఉంటే ఈ అక్రమ కట్టడాలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు .జారీ చేసిన డెమాలిషన్ ఆర్డర్లు కేవలం కాగితాలకే పరిమితమై బుట్టదాఖలవుతున్నాయని వారు మండిపడుతున్నారు. అధికారుల ఉదాసీనతతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ) ప్రతిష్ట భ్రష్టు పట్టిందని, ఈ అక్రమ నిర్మాణాలపై సిఎంసీ కమిషనరే నేరుగా స్పందించి సమాధానం చెప్పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

- తెలంగాణలో వర్షా లు.. ఏపీలో ఎండలు
- సౌత్ లో లోటు.. ఉత్తరాదికి వర్షసూచన

02

## బీఆర్ఎస్ ను రద్దుచేయాలి

మంత్రులందరి శాఖలు మార్చాలని సూచించా

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

గ్రాడ్యుయేట్ అభ్యర్థులపై వడపోత పూర్తి

02





## ప్రపంచవ్యాప్తంగా యుపీఐ సేవలు విస్తరించాలి'

03

ఫిన్‌టెక్ కంపెనీలకు మోదీ పిలుపు

## ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

**ఎగుమతులు పెంచడమే లక్ష్యం**

- తెలంగాణ–ఫిలిప్పీన్స్ వాణిజ్య విస్తరణకు అడుగులు.
- బియ్యం, విత్తనాలు, మాంస ఉత్పత్తులపై చర్చ.
- నాణ్యత, పోటీ ధరలు, సకాలంలో సరఫరా.
- అంతర్జాతీయ మార్కెట్‌తో రైతులకు లాభం.
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

04



## కాంగ్రెస్–బీఆర్ఎస్‌ది 'నువ్వు కొట్టినట్లు.. నేను ఏడ్చినట్లు' రాజకీయం

- ప్రజా సమస్యలను గాలికొదిలి అసెంబ్లీలో డ్రామాలు.
- నేతల భాష చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.
- 22A భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సాగునీరు, ఉద్యోగాలపై చర్చించాలి.
- డైవర్షన్ రాజకీయాలు ఆపండి బండి సంజయ్.

03



# అక్రమ నిర్మాణాలు కూల్చేదెన్నడు..!



**మహా, స్టేట్ బ్యూరో చీఫ్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని శేరిలింగంపల్లి మండలం, కూకట్‌పల్లి జోన్, హైటెక్‌సిటీ-కూకట్‌పల్లి ప్రధాన రహదారిని ఆనుకుని బుట్టా కన్వెన్షన్ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న భారీ అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. వంద కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిగా గుర్తింపు పొందిన సర్వే నంబర్లు 11/33, 11/34 లలో సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత శాఖల నుంచి ఎలాంటి కఠిన చర్యలు కనిపించకపోవడం స్థానికంగా పలు విమర్శలకు తావిస్తోంది. దాదాపు మూడు వారాల క్రితమే అక్రమ నిర్మాణాలపై కూల్చివేత చర్యలు చేపట్టాలని స్వయంగా సీఎంసీ కమిషనర్ డా. జి. సృజన ఉన్నతాధికారులకు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు డెమాలిషన్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఒక్క ఇటుక కూడా తొలగించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు నిర్మాణ మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే 7 అంతస్తులు పూర్తికాగా ఎనిమిదో అంతస్తుకు సన్నాహాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఉన్నట్టా.. లేనట్టా..!**

అక్రమ నిర్మాణాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పనితీరుపైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖానామెట్‌లో భారీ బహుళ అంతస్తుల నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయిలో ఎందుకు రంగంలోకి దిగడం లేదన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అక్రమ నిర్మాణాలపై కూల్చివేత చర్యలు చేపట్టాలని స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఇప్పటి వరకు వాటి అమలు ఎంతవరకు వచ్చిందన్న విషయాన్ని అధికారులు వెల్లడించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఆదేశాలు జారీ చేసి మూడు వారాలు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం ఆగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. భారీ నిర్మాణం కళ్లముందే కొనసాగుతున్నా టాస్క్‌ఫోర్స్ స్పందించకపోవడంతో.. అసలు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఉన్నట్టా.. లేనట్టా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**డెమాలిషన్ ఆర్డర్లు.. బుట్టదాఖలేనా..!**

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ అవి అమలుకు నోచుకోకపోవడం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. డెమాలిషన్ ఆర్డర్లు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా..? లేక వాటిని అమలు చేయకుండా ఏవైనా అడ్డంకులు ఉన్నాయా..? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉందని,ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా ఎందుకు వేచి చూస్తున్నారన్నది స్థానికులకు అంతుచిక్కడం లేదని వారు వాపోతున్నారు.

**పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం.. పెద్దోళ్ల భవనాలపై వెనకడుగు..!**

చిన్నచిన్న నిర్మాణాల విషయంలో హడావుడిగా నోటీసులు, కూల్చివేతలు చేపట్టే అధికారులు.. భారీ బహుళ అంతస్తుల భవనాల విషయంలో మాత్రం ఎందుకు వెనుకంజ వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి."పిచ్చుకలపై బ్రహ్మాస్త్రం ప్రయోగించే అధికార యంత్రాంగం.. పెద్దోళ్ల భవనాలు కూల్చాలంటే ఎందుకు జంకుతోంది..?" అంటూ స్థానికులు నిలదీస్తున్నారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాల్సి ఉండగా, పలుకుబడి ఉన్నవారి నిర్మాణాల విషయంలో అధికారులు మెతక వైఖరి అవలంబిస్తున్నారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని వారు కోరుతున్నారు.

**అక్రమ నిర్మాణాలతో భ్రష్టుపట్టిన సీఎంసీ..!**

సీఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు కొనసాగుతున్నా, సంబంధిత అధికారులు ఎక్కడున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
నిర్మాణాలు పూర్తయ్యే వరకు చూస్తూ ఉండి.. ఆ తర్వాత నోటీసులు జారీ చేయడం, కూల్చివేత ఆదేశాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి జరిగే నష్టాన్ని ఎవరు భరిస్తారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమైతే మున్సిపల్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

**సిఎంసీ కమిషనర్ ఆదేశాలకే విలువ లేకపోతే..?**

సీఎంసీ కమిషనర్ డా. జి. సృజన అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని ఇప్పటికే స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ఆదేశాలకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.కమిషనర్ ఆదేశాలు అధికారుల స్థాయిలో ఎందుకు అమలు కావడం లేదు..? ఎవరి ఒత్తిళ్ల వల్ల చర్యలు నిలిచిపోయాయి..? లేక అధికారుల నిర్లక్ష్యమే కారణమా..? అనే అంశాలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రమాదం జరిగాకే మేల్కొంటారా..!**

ఇటీవల అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణం కూలి ప్రాణనష్టం జరిగిన ఘటన నేపథ్యంలోనైనా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే నిలిపివేయకుండా అవి బహుళ అంతస్తులకు చేరుకునే వరకు చూస్తే, ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణనష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. "ప్రమాదం జరిగి ప్రాణాలు పోయిన తర్వాత చర్యలు తీసుకుంటారా..? లేక ముందుగానే స్పందించి ప్రజల ప్రాణాలు, ప్రభుత్వ ఆస్తులను కాపాడతారా..?" అని ఖానామెట్ వాసులు అధికార యంత్రాంగాన్ని నిలదీస్తున్నారు.

**సీఎంసీ కమిషనరే సమాధానం చెప్పాలి..!**

ఖానామెట్ ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా కొనసాగుతున్న బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలపై సీఎంసీ కమిషనర్ స్వయంగా దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని స్థానికులు కోరుతున్నారు. సర్వే నంబర్లు 11/33, 11/34 లలోని భూమి స్వభావం, భవన నిర్మాణ అనుమతులు (ప్లానింగ్), నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాల కూల్చివేతలకి ఇప్పటికే స్పెషల్ టాస్క్ ఫోర్స్ కి జారీ చేసిన ఆదేశాల ప్రకారం తక్షణమే కూల్చివేతలు జరపాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, సదరు భవనాన్ని వెంటనే సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యతను అధికారులు విస్మరిస్తే, భవిష్యత్తులో మరిన్ని ఆక్రమణలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.నోటీసులు ఉన్నా నిర్మాణాలు ఆగవు.. ఆదేశాలు వచ్చినా కూల్చివేతలు జరగవు.. టాస్క్‌ఫోర్స్ ఉన్నా చర్యలు కనిపించవు..! మరి, "ఈ అక్రమ నిర్మాణాలను కూల్చేది ఎన్నడు.. బాధ్యులపై కేసులు పెట్టేది ఎప్పుడు..?" అని ఖానామెట్ ప్రజలు వేస్తున్న ప్రశ్నకు సీఎంసీ ఉన్నతాధికారులు ఎప్పుడు సమాధానం చెబుతారో వేచి చూడాల్సిందే.

**సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలి...!**

ఖానామెట్ ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా కొనసాగుతున్న బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ స్వయంగా ముఖ్యమంత్రి పరిధిలోనే (సొంత పోర్ట్‌ఫోలియో) ఉండటంతో, ఆయన పర్యవేక్షణలోని శాఖలోనే ప్రభుత్వ భూములు ఇలా ఆక్రమణలకు గురికావడం అక్రమ నిర్మాణాలు కోకొల్లలుగా వెలియడంపై స్థానికులు తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మహాలో వెలువడిన కథనాలు




## ట్రంప్ హ్యాట్రిక్ ప్లాన్

- మూడోసారి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్?
- వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికై.. ప్రెసిడెంట్ తో రాజీనామా చేయించే ప్లాన్

**మహా :** ప్రముఖ చైనీస్‌కెనడియన్ విద్యావేత్త, చైనా నోస్ట్రాడామస్‌గా పేరొందిన జియాంగ్ జుక్సిన్ సంచలన జోస్యం చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ ముచ్చటగా మూడోసారి అమెరికా అధ్యక్షుడవుతారని అన్నారు. 'ప్రిడిక్టివ్ హిస్టరీ' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తూ గేమ్ థియరీ ఆధారంగా జియోపాలిటికల్ విశ్లేషణలు చేసే ఆయన, ప్రాచీన గ్రీకు చరిత్రను ఆధారం చేసుకుని భవిష్యత్తుపై పలు అంచనాలను వెలువరించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో జరుగుతున్న ఘర్షణలు కేవలం వైమానిక దాడితో ముగియవని, అమెరికా తప్పనిసరిగా భూతల దాడులు చేపట్టాల్సి వస్తుందని చెప్పారు. ఈ యుద్ధం ఏళ్ల తరబడి సాగి అమెరికాకు కోలుకోలేని దెబ్బ తీస్తుందని హెచ్చరించారు. యుద్ధం కారణంగా అమెరికా ప్రభుత్వం తప్పనిసరి సైనిక సేవలను తిరిగి ప్రవేశ పెట్టేలా చట్టపరమైన సన్నాహాలు చేస్తుందని, దీనివల్ల యువత సైన్యంలో చేరాల్సిన పరిస్థితి వస్తుందని అంచనా వేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అధ్యక్ష పదవిని చేపడతారని తాను నమ్ముతున్నట్లు జియాంగ్ చెప్పుకొచ్చారు. ప్రస్తుత అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఏ వ్యక్తి కూడా రెండుసార్ల కన్నా ఎక్కువసార్లు అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యే అవకాశం లేదు. కానీ ఇది వినడానికి మీకు వింతగా అనిపించవచ్చు.కానీ, జియాంగ్ మాత్రం రాజ్యాంగంలోని ఒక ఆసక్తికరమైన లొసుగును ఇందుకు ప్రాతిపదికగా తీసుకున్నారు. ట్రంప్ భవిష్యత్తులో అమెరికా వైస్ ప్రెసిడెంట్ (ఉపాధ్యక్షుడు)గా పోటీ చేసి గెలుపొందుతారు. ఆ తర్వాత అప్పటి అధ్యక్షుడు రాజీనామా చేస్తే, రాజ్యాంగ ప్రకారం ఉపాధ్యక్షుడిగా ఉన్న ట్రంప్ ఆటోమేటిక్‌గా అధ్యక్ష పీఠాన్ని అధిరోహిస్తారు. ఇలా ట్రంప్ నేరుగా ఎన్నిక కాకుండానే మూడోసారి దేశానికి అధ్యక్షుడు అవుతారని జియాంగ్ అంచనా వేశారు. ట్రంప్, ఆయన మిత్రపక్షాలు కూడా గతంలో ఈ విధమైన లొసుగుల అవకాశాన్ని పదేపదే ప్రస్తావించడంతో జియాంగ్ విశ్లేషణ ప్రాధాన్యత సంతరించుకుంది.

## తెలుగు ఇండస్ట్రీలో మరో ప్రామిసింగ్ స్టార్
# శ్రీనాథ్ మాగంటి



( మొదటి పేజీ తరువాయి )

' వంటి హిట్ చిత్రాల్లో నటించగా, కొందరు ప్రేక్షకులు నన్ను పరభాషా నటుణ్ణి అనుకుంటున్నారు. కానీ నేను పక్కా తెలుగు యాక్టర్‌ని. ఈ సినిమాతోనైనా తెలుగు ప్రేక్షకులు నా పేరు గుర్తు పెట్టుకుంటారని ఆశిస్తున్నానని శ్రీనాథ్ వినమ్రంగా చెబుతాడు. ప్రేక్షకుల గుండెల్లో కొంతకాలం పాటు గుర్తుండిపోయే పాత్రల్లో నటించాలని శ్రీనాథ్ కోరిక. అది ఈఎన్‌ఈ2తో తీరనుండగా, ఇంకా క్రేజీ ప్రాజెక్టులు చర్చల్లో ఉన్నాయి. సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన 'యానిమల్' సినిమా రూ. 900 కోట్లకు పైగా వసూళ్లు సాధించి.. సెన్సేషన్ క్రియేట్ చేయగా శ్రీనాథ్ లక్కీ యాక్టర్ గా మారారు. ఇప్పుడు టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'ఈ నగరానికి ఏమైంది 2' లో ఒక హీరోగా నటిస్తున్న శ్రీనాథ్ కెరీర్‌కు ఇది బూస్ట్ అవుతుందని ఇండస్ట్రీ టాక్.

# కేసీఆర్ కేంద్రంగా.. రచ్చ

( మొదటి పేజీ తరువాయి )

సస్పెండ్ చేశారు. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య హోరాహోరీగా వాడివేడి విమర్శలు, ఘర్షణల మధ్య సభ సాగింది. సభలో బయటా అదే రగడ జరగ్గా, పలు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను అరెస్ట్ చేశారు. కేసీఆర్ ఫామ్ హౌజ్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు వెళ్తారన్న సమాచారంతో కేటీఆర్, హరీష్, పల్లా రాజేశ్వరరెడ్డి సహా ముఖ్యనేతలు ఎర్రవెల్లి వెళ్తుండగా, మార్గమధ్యలోనే పోలీసులు అరెస్ట్ చేశారు.

**సీఎం పై కేటీఆర్ అసభ్య పదజాలం**

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అనుచిత వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. క్రిమినల్ మనస్తత్వం ఉన్న సీఎం తెలంగాణకు ఉండటం దురదృష్టమని పేర్కొన్నారు. చిల్లర అంటూ తీవ్ర అసభ్యపదజాలంతో మాట్లాడారు. మంగళవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని, చీర లాగారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి.. అసెంబ్లీ స్పీకర్ కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లుగా గజ్వేల్‌కి కాంగ్రెస్ గూండాలను, పోలీసులను పంపించారని ఆగ్రహించారు. రేవంత్‌రెడ్డి మనసులో మాటను ఇద్దరు శాసన సభ సభ్యులు మాట్లాడారని చెప్పుకొచ్చారు.



## శాంసంగ్ కీలక నిర్ణయం

**.. భారత్‌లో లేఆఫ్స్**
**100 ఉద్యోగాల తొలగింపు**

**ఢిల్లీ, మహా :** శాంసంగ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. టీవీలు, ఇతర గృహోపకరణాలకు డిమాండ్ తగ్గుతుండటంతో పాటు ఖర్చులు కూడా పెరగడంతో ఉద్యోగులను తొలగించేందుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది. భారత్‌లో కార్యకలాపాలను పునర్ వ్యవస్థీకరించే దిశగా ఇప్పటికే దాదాపు 100 మందిని తొలగించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. డైరెక్టర్ స్థాయి అధికారులు మొదలు ప్రధాన కార్యాలయంలోని టీమ్ లీడర్లపై తొలగింపుల ప్రభావం ఉన్నట్టు సమాచారం. బ్రాంచ్, ఏరియా మేనేజర్లు కూడా లేఆఫ్స్‌కు గురైనట్టు తెలుస్తోంది. మెమరీ చిప్‌ల ధరల పెరుగుదల, రూపాయి బలహీనంగా ఉండటం, ముడి సరకు ధరలు పెరగడం వంటివి శాంసంగ్ ఇండియా అమ్మకాలు, మార్జిన్లపై ప్రభావం చూపినట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

# బీఆర్ఎస్ ను రద్దుచేయాలి

- మంత్రులందరి శాఖలు మార్చాలని సూచించా
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు
- గ్రాడ్యుయేట్ అభ్యర్థులపై వడపోత పూర్తి

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఫెయిలయ్యాడని, ఐదేళ్ళు మహిళ లేకుండానే కేబినెట్ నడిపారని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీని రద్దుచేసుకోవాలని, నాడు భట్ట విక్రమార్క ప్రతిపక్ష హోదా పోగొట్టి, నేడు దళిత స్పీకర్ ను అవమానించి తమ దళిత వ్యతిరేక విధానాలు చాటుకున్నారన్నారు. కేసీఆర్ స్క్రిప్ట్ ప్రకారం తాతా మధు మాట్లాడారన్నారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ మార్చాలని తాను కాంగ్రెస్ అధిష్టానానికి సూచించినట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వెల్లడించారు. . అయితే కేబినెట్ విస్తరణ, శాఖల కేటాయింపు వంటి అంశాలపై తుది నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్టానానిదేనని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడిగా తాను చేయాల్సింది, సూచించాల్సింది పార్టీ అధిష్టానానికి తెలియజేయడమేనని అన్నారు. దాని తర్వాత తీసుకునే నిర్ణయాలు ముఖ్యమంత్రి, కాంగ్రెస్ హైకమాండ్ పరిధిలో ఉంటాయని తెలిపారు.ప్రస్తుత మంత్రుల శాఖలను మార్చే అంశంపై తాను అధిష్టానానికి సూచన చేసినట్లు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంత్రుల పనితీరు, శాఖల నిర్వహణ, ప్రభుత్వ ప్రాధాన్యతలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పునర్వ్యవస్థీకరణ చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వ్యాఖ్యలను బట్టి స్పష్టమవుతోంది. తనను మంత్రివర్గంలోకి తీసుకుంటారా? లేదా? అనే ప్రశ్నకు కూడా మహేష్ కుమార్ గౌడ్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. ఆ నిర్ణయాన్ని పూర్తిగా కాంగ్రెస్ అధిష్టానానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం తనకు అత్యంత బాధ్యతాయుతమైన టీపీసీసీ అధ్యక్ష పదవి ఉందని, పార్టీని నడిపించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నానని చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహించడంపైనే ప్రస్తుతం దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థుల వడపోత పూర్తి అయిందని, హైకమాండ్ కు నాలుగుపేర్ల చొప్పున పంపామన్నారు.



# సెప్టెంబర్‌లోనూ వర్షాల లోటే

**మహా :** సెప్టెంబర్ నెలలో వర్షాలు దేశవ్యాప్తంగా ఒకేలా ఉండే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, దక్షిణ భారతదేశంలో పలు ప్రాంతాల్లో మాత్రం వర్షాల తీవ్రత తక్కువగానే ఉంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కేరళలో ఇప్పటికే వర్షపాత లోటు కనిపిస్తోంది. మరోవైపు తెలంగాణలో రానున్న రోజుల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తాజా అంచనాల ప్రకారం దక్షిణ ద్వీపకల్పంలో రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితి ప్రాంతాల వారీగా మారనుంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 7 వరకు నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే 45 శాతం తక్కువ వర్షం నమోదైంది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అధిక వర్షపాత లోటు ఉన్న ప్రాంతాల్లో ఏపీ కూడా ఉంది. రానున్న రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తారమైన వర్షాలు కురిసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. అయితే వాతావరణ పరిస్థితుల్లో కీలక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉంది. సెప్టెంబర్ 11 ప్రాంతంలో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్ - దక్షిణ ఒడిశా తీరాల సమీపంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాల అవకాశాలు క్రమంగా పెరగనున్నాయి. ఐఎండీ తాజా బులెటిన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. ఆ తర్వాత 12 నుంచి 14 వరకు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అంటే తెలంగాణలో వెంటనే భారీ వర్షాల పరిస్థితి కాకుండా, రానున్న రోజుల్లో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం కనిపిస్తోంది. అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయ, బిహార్, తూర్పు మధ్యప్రదేశ్, తూర్పు ఉత్తరప్రదేశ్, నాగాలాండ్, మణిపుర్, మిజోరం, త్రిపుర, ఒడిశా, బంగాల్, సిక్కింలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అండమాన్ నికోబార్, బిహార్, ఒడిశా, సబ్‌హిమాలయన్ బంగాల్, సిక్కిం సహా కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

# నకిలీ ప్రొఫెసర్.. నకిలీ పరీక్షలు!

**కరీంనగర్ మహా:**
ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తూ రూ.44 లక్షలు వసూలు చేసిన నకిలీ ప్రొఫెసర్‌ను కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శాతవాహన యూనివర్సిటీలో బోటనీ ప్రొఫెసర్‌నని, ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని నమ్మించిన దుడపాక తిరుపతి (51) డేటా ఎంట్రీ ఆపరేటర్, రికార్డ్ అసిస్టెంట్, టికెట్ బుకింగ్ క్లర్క్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సుమారు 21 మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. బాధితులకు అనుమానం రాకుండా నకిలీ ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, సర్వీస్ రిజిస్టర్లు, నియామక ఉత్తర్వులు సృష్టించి మోసం చేశాడు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలమ్ ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో తిరుపతిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వాంగ్మూలం ఆధారంగా నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరో ఏడుగురు పరారీలో ఉండగా, వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగేవారిని నమ్మవద్దని పోలీసులు హెచ్చరించారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**పెద్దపల్లి మహా, సెప్టెంబర్ 08:** గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ నెల 14న ప్రారంభమై 25న నిమజ్జనంతో ముగియనున్న ఉత్సవాల నేపథ్యంలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లకు చెందిన హిందూ మత పెద్దలు, మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపం, విగ్రహం ఎత్తు, నిర్వాహకుల వివరాలు, శోభాయాత్ర మార్గం, నిమజ్జన వాహనాల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి మండపాన్ని జియో ట్యాగింగ్ చేసి 'టీజీకాప్'లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, 24 గంటలు ఇద్దరు నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు. ట్రాఫిక్, అత్యవసర వాహనాలకు ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. జూదం, లక్కీ డ్రాలు, బలవంతపు చందాలు, మద్యం సేవించడం వంటి వాటికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ అనుమతితోనే కనెక్షన్లు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. డీజే శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని, ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సీపీ సూచించారు.

# పాలకుర్తిలో బీఆర్ఎస్ మండల యువజన నాయకుడు అరవింద్ ముందస్తు అరెస్ట్

**బసంత్‌నగర్ పీఎస్‌కు తరలింపు**

**పాలకుర్తి,సెప్టెంబర్ 8 మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ లు అప్రమత్తమయ్యారు.ఈ ముందస్తు చర్యల్లో భాగంగా, పాలకుర్తి మండల బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మాదాసు అరవింద్‌ను మంగళవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ని బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రులు

**కరీంనగర్ మహా:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలమ్‌తో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్, విద్యుత్, తాగునీరు, లైటింగ్, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సెప్టెంబర్ 23న ప్రధాన నిమజ్జనం నేపథ్యంలో నిమజ్జన పాయింట్ల వద్ద బ్యారికేడ్లు, క్రేన్లు, గజ ఈతగాళ్లు, బోట్లు, మెడికల్ క్యాంపులు, 108 వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులను ముందుగానే పూర్తి చేయాలన్నారు.




ఉత్సవ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ కనెక్షన్లు అందిస్తుందని, స్వయంగా కనెక్షన్లు తీసుకుని ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. మద్యం విక్రయాలు, బలవంతపు చందాలు, ఇతర సమస్యలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీపీ గౌష్ ఆలమ్ మాట్లాడుతూ పోలీసుల ఆధ్వర్యంలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని వెల్లడించారు.

# కాంగ్రెస్–బీఆర్ఎస్‌ది 'నువ్వు కొట్టినట్లు.. నేను ఏడ్చినట్లు' రాజకీయం.

**హైదరాబాద్, మహా:** తెలంగాణ శాసనసభ సమావేశాల తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఇరు పార్టీలు రాజకీయ డ్రామాలకు తెరతీస్తున్నాయని ఆరోపించారు. 'నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా' అన్న చందంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం లాలూచీ రాజకీయాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని, కొందరు నేతలు ఉపయోగిస్తున్న బజారు భాషను చూసి నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన శాసనసభలో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు.

**స్పీకర్‌పై వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదు**

శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ నేతలు అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరని బండి సంజయ్ అన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నేతలపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తాతా మధు తదితరుల వ్యవహారంలోనూ చట్టాన్ని ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, రాజకీయ పలుకుబడితో ఎవరినీ తప్పించకూడదని సూచించారు.

**కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై ప్రశ్నలు**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకపోవడాన్ని బండి సంజయ్ ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీకి రానప్పుడు ఆయనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎందుకని నిలదీశారు. ప్రజా సమస్యలపై చర్చ జరిగే శాసనసభకు ప్రతిపక్ష నాయకత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**22A భూములపై ప్రజలకు ఇబ్బందులు**

రాష్ట్రంలో 22A నిషేధిత భూముల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బండి సంజయ్ అన్నారు. భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో మంత్రులు, అధికార పార్టీ నేతలు వేల కోట్ల రూపాయల భూదందాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని, భూముల వ్యవహారాల్లో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విద్యార్థుల ఆందోళనఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్ అన్నారు. బకాయిల కారణంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక చదువులు, ఉద్యోగ అవకాశాల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు తీవ్రంగా లాఠీచార్జ్ చేశారని ఆరోపించారు. రక్తం కారేలా కొట్టడం దారుణమని విమర్శించారు. నిరసనల్లో పాల్గొన్న వారిపై అధిక బలప్రయోగం చేయకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించాలని సూచించారు.

**రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై చర్చ ఏది?**

సాగునీరు అందక దక్షిణ తెలంగాణ రైతాంగం ఆందోళనలో ఉందని బండి సంజయ్ అన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, డీఏలు, పెండింగ్ బిల్లులు విడుదల కాక ఉద్యోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపైనా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.
ఇలాంటి కీలక అంశాలపై చర్చించాల్సిన అసెంబ్లీ సమయాన్ని ఒకే అంశంపై రెండు రోజులపాటు చర్చించడంతో వృథా చేయడం సరికాదని విమర్శించారు. ప్రజల సమస్యలపై సమగ్ర చర్చ జరిపి పరిష్కార మార్గాలను సూచించాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్ష పార్టీలపై ఉందన్నారు.

**'కాంగ్రెస్–బీఆర్ఎస్ దొందూ దొందే'**

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే తీరులో వ్యవహరిస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. ఇరు పార్టీలు పరస్పరం విమర్శించుకుంటూ ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లిస్తున్నాయని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు కాకుండా పాలన, ప్రజా సమస్యలు, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.అసెంబ్లీ వేదికగా రాజకీయ డ్రామాలు, డైవర్షన్ రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించాలని బండి సంజయ్ హితవు పలికారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 22A భూములు, సాగునీరు, ఉద్యోగాలు, ఉద్యోగుల సమస్యలు, హామీల అమలు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ప్రపంచవ్యాప్తంగా యుపీఐ సేవలు విస్తరించాలి'

**ఫిన్‌టెక్ కంపెనీలకు మోదీ పిలుపు**

**ముంబయి, మహా :** భారతదేశపు యూపీఐ ప్రస్తుతం 11 దేశాల్లో అందుబాటులో ఉందని, ఆ సేవలు ఇతర దేశాల చెల్లింపు వ్యవస్థలతో అనుసంధానం కావడమే తమ తదుపరి లక్ష్యం కావాలని ఫిన్‌టెక్ రంగానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. యూపీఐ ద్వారా చేసే చెల్లింపులు లావాదేవీల ఖర్చులను, సమయాన్ని ఆదా చేయడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. మంగళవారం ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. సాంకేతికత అనేది అందరినీ కలుపుకొనిపోయేలా చేయడంలో అత్యంత ప్రభావవంతమైన సాధనం. ఆ విషయాన్ని UPI మనకు నిరూపించింది. ఫిన్‌టెక్ విషయానికి వస్తే సాంప్రదాయ బ్యాంకులు లేదా బ్యాంక్ శాఖలు ఇప్పటివరకు చేరుకోలేని ప్రాంతాలకు, ప్రజలకు చేరువ కావడమే దాని ప్రత్యేక లక్షణం కావాలి. మారుమూల ప్రాంతాల్లో ఉండే ప్రజలందరికీ ఈ ఆధునిక డిజిటల్ ఆర్థిక సేవలు అందేలా చేయడంలో యూపీఐ అద్భుతమైన విజయం సాధించింది. విదేశాలలో అత్యధిక సంఖ్యలో భారతీయులు నివసిస్తున్నారు. విదేశాల్లో ఉన్న మనవాళ్లు స్వదేశానికి అత్యధికంగా నిధులు పంపుతున్నారు. ప్రస్తుతం విదేశీ మనీ ట్రాన్స్‌ఫర్ల కోసం అయ్యే లావాదేవీల ఖర్చులు, యూపీఐ ద్వారా భారీగా తగ్గుతాయి. అలాగే డబ్బు కూడా చాలా వేగంగా చేరుతుంది." అని మోదీ అన్నారు.

# తెలంగాణ కేబినెట్‌లో సమూల మార్పులు?.

**హైదరాబాద్, మహా :** తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, శాఖల పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్న వేళ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ మార్చాలని తాను కాంగ్రెస్ అధిష్టానానికి సూచించినట్లు ఆయన వెల్లడించారు. అయితే కేబినెట్ విస్తరణ, శాఖల కేటాయింపు వంటి అంశాలపై తుది నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్టానానిదేనని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్ లో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడిగా తాను యాల్సింది, సూచించాల్సింది పార్టీ అధిష్టానానికి తెలియజేయడమేనని అన్నారు. దాని తర్వాత తీసుకునే నిర్ణయాలు ముఖ్యమంత్రి, కాంగ్రెస్ హైకమాండ్ పరిధిలో ఉంటాయని తెలిపారు. ప్రస్తుత మంత్రుల శాఖలను మార్చే అంశంపై తాను అధిష్టానానికి సూచన చేసినట్లు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంత్రుల పనితీరు, శాఖల నిర్వహణ, ప్రభుత్వ ప్రాధాన్యతలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పునర్వ్యవస్థీకరణ చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వ్యాఖ్యలను బట్టి స్పష్టమవుతోంది.

# హస్తకళాకారుల అభివృద్ధికి కామన్ ఫెసిలిటీ సెంటర్లు.

- **హస్తకళా ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్.**
- **ప్రతి కళాకారుడి వివరాలు తెలిసేలా QR కోడ్.**
- **కళాకారులు పస్తులు ఉండకూడదు.**
- **పనికి ఆటంకం కలగకూడదు.**
- **ఉచిత వైద్య సేవలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి.**



అమరావతి, మహా: ఆంధ్రప్రదేశ్‌లో హస్తకళాకారుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. కళాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.హస్తకళాకారులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు క్లస్టర్ల వారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో సవర కళాకారుల సెంటర్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. వీబీ-జీ రామ్ జీ నిధులతో ఈ సెంటర్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. మదనపల్లి, అనంతపురం, పెడన ప్రాంతాల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని పవన్ తెలిపారు. త్వరలో ఆయా ప్రాంతాల్లో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కళాకారులకు ఉత్పత్తి, శిక్షణ, నిల్వ, మార్కెటింగ్ తదితర అవసరాలకు ఈ సెంటర్లు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

**ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్‌కు రూ.12 లక్షలు**

ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్ అభివృద్ధికి రూ.12 లక్షలు కేటాయించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో సెంటర్‌కు మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్ నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు.ఏటికొప్పాక ఆరోగ్య కేంద్రం పనులను కూడా పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ తెలిపారు. హస్తకళాకారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.ప్రతి కళాకారుడి వివరాలు QR కోడ్‌లో హస్తకళా ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు వేగవంతం చేశామని పవన్ కల్యాణ్ తెలిపారు. ఉత్పత్తులపై QR కోడ్ ఏర్పాటు చేసే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.
QR కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ ఉత్పత్తిని తయారు చేసిన కళాకారుడి వివరాలతో పాటు ఆయన చేసిన శ్రమ, ఉత్పత్తికి సంబంధించిన సమాచారం వినియోగదారులకు అందేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల కళాకారుడి గుర్తింపు పెరగడంతో పాటు వారి ఉత్పత్తులకు మార్కెట్లో ప్రత్యేక విలువ లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
గ్లోబల్ మార్కెట్‌తో అనుసంధానం
రాష్ట్రంలోని హస్తకళలను దేశీయ మార్కెట్‌కే పరిమితం చేయకుండా ప్రపంచ మార్కెట్లకు అనుసంధానం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పవన్ కల్యాణ్ వివరించారు. నాణ్యమైన హస్తకళా ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు కళాకారులకు మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని అన్నారు.
హస్తకళాకారుల సంక్షేమానికి మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కళాకారుల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం, ఆదాయం లభించేలా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.హస్తకళాకారుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారుల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని చెప్పారు.
ఇప్పటికే నిర్వహించిన 6 ఉచిత నేత్ర వైద్య శిబిరాల్లో 1,708 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. వారిలో సుమారు 93 మందికి ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. మరో 1,253 మందికి పైగా ఉచిత కళ్లద్దాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.
హస్తకళాకారులు ఆర్థిక ఇబ్బందులతో పస్తులు ఉండకూడదని, వారి పనికి ఎలాంటి ఆటంకం కలగకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కళాకారుల జీవనోపాధిని కాపాడుతూ వారి ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, ఆరోగ్య భద్రత అందించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి అంశాలను సమగ్రంగా ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

# వరంగల్ లో ట్రాఫిక్ నియంత్రణ ఏది?

**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ నగరం లో ఒకప్పుడు ప్రణాళికాబద్ధంగా ఉన్న వరంగల్ నగర రోడ్లు ఇప్పుడు ఆటో అడ్డాలు, రోడ్లపైనే విచ్చలవిడిగా వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారుల ఆక్రమణలతో ట్రాఫిక్ నియంత్రణ లేక వరంగల్ నగరం అస్తవ్యస్తంగా తయారైంది. ట్రాఫిక్ పోలీసులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో నగరంలోని ప్రధాన కూడళ్లు, రోడ్లు పూర్తిగా ఆక్రమణకు గురవుతున్నాయి.




**ప్రధాన రోడ్ల పైనే ఆటోల పార్కింగ్ -ట్రాఫిక్ స్తంభన***

వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్, అండర్ బ్రిడ్జి రోడ్డు, పోస్ట్ ఆఫీస్, పోచమ్మ మైదాన్ జంక్షన్ ఇరువైపులా, కాశిబుగ్గ, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం, వద్ద ఆటోలు రోడ్డుపైనే విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ ను స్తంభింప చేయడం వల్ల వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా నగరంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు ఉండడం వల్ల వాటికి సరైన పార్కింగ్ లేక సగం రోడ్లను ఆక్రమిస్తూ వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వచ్చి పోయే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరం నడిబొడ్డున ఆటో అడ్డాలు ప్రయాణికుల కోసం అంటూ రోడ్డు మీద పార్కింగ్ చేయడం ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభిస్తోందని వాహనదారులు చెబుతున్నారు. ఇదంతా మామూలే అని ఏదైనా ఫిర్యాదు అందినప్పుడు ట్రాఫిక్ పోలీసులు వచ్చి ఫోటో తీసి వెళ్తారు" అని ఓ ఆటో డ్రైవర్ చెప్పారు.

**ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమించిన చిరు వ్యాపారులు**

వరంగల్ నగరంలోని ఆర్ఎస్టీ రోడ్డు, సికెఎం ప్రసూతి ఆసుపత్రి లైన్, అండర్ బ్రిడ్జి రోడ్డు, కాశీబుగ్గ జంక్షన్ సిద్దయ్య హోటల్ రోడ్డు, చార్ బౌలి రోడ్డు మీదే టిఫిన్ సెంటర్ ఇవన్నీ ట్రాఫిక్ అంతరాయానికి అవరోధాలుగా నిలిచాయి. ముఖ్యంగా మండి బజారులో అయితే రోడ్డు ఇరువైపులా సగానికి పైగా రోడ్డును ఆక్రమించి వాహనాలను విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీస్ అధికారి అలాగే అధికారులు మండి బజారులో పెట్రోలింగ్ నిర్వహిస్తారు కానీ వాహనాల పార్కింగ్ పై చర్యలు తీసుకోకపోగా ట్రాఫిక్ ను నియంత్రించే ప్రయత్నం కూడా చేయరని నగర ప్రజలతోపాటు వాహనదారులు మండి పడుతున్నారు. మండి బజారులో సాయంత్రం 6 గంటల నుండి అర్థ రాత్రి 2 గంటల వరకు రద్దీ కొనసాగుతుంది. ఎందుకంటే ఈ ప్రాంతంలో బిర్యాని హోటల్స్, టీ షాపులు, పాన్ షాపులు, టిఫిన్ సెంటర్ ఇవన్నీ దాదాపు అర్థరాత్రి వరకు తెరిచే ఉంటాయి ఇక్కడ ఎన్నోసార్లు నేరాలు, ఘోరమైన హత్యా ఘటనలు చోటు చేసుకున్న పోలీసులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పెట్రోలింగ్ కూడా అంతంత మాత్రంగానే నిర్వహించి చేతులు దులుపు కుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలోని ప్రజల రోడ్లన్నీ పండ్లు, కూరగాయలు, బట్టలు, ప్లాస్టిక్ సామాన్లు అమ్మేవారు ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించారు. దీంతో పాదచారులు రోడ్డు మధ్యలో నడవాల్సి వస్తోంది.

**పాదచారులు, వాహనదారుల ఇబ్బందులు**

స్కూల్ పిల్లలు, ఆఫీస్‌కు వెళ్లే ఉద్యోగులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు విచ్చలవిడి పార్కింగ్ లతో పాటు రోడ్లు ఆక్రమణల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల నుండి ఎంజీఎం ఆసుపత్రికి ఎమర్జెన్సీ గా వచ్చే సమయంలో అంబులెన్సులు కూడా ట్రాఫిక్ నియంత్రణ లోపం ఆటోల కారణంగా ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. రోడ్డు మీద నడవడానికి ఫుట్ పాత్ కు చోటు లేదు. ఉదయం స్కూల్ కళాశాలకు వెళ్లే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.

**ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు**

ఈ సమస్య పై పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు, బల్దియా కు ఫిర్యాదులు చేసినా ఎలాంటి ఫలితం లేదు. ట్రాఫిక్ అధికారులు రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసి చలాన్లు విధించడం వరకే వారి పని పూర్తవుతుంది. అప్పుడప్పుడు స్పెషల్ డ్రైవ్ ల పేరుతో వచ్చి ఆటోలకు, వాహనాలకు ఫైన్లు వేసి వెళ్తారు. మరుసటి రోజు మళ్లీ అంతా యదాతథం. జీడబ్ల్యూఎం సి ఎన్‌క్రోచ్‌మెంట్ సిబ్బంది కూడా నెలకు ఒకసారి వచ్చి వ్యాపారుల వస్తువులు తీసుకుని వెళ్లడంతో సరిపెడుతున్నారు.

**అధికారులకు మామూళ్లు ముడుతున్నాయా?**

నగరంలోని చిరు వ్యాపారులు, వ్యాపార సముదాయాల యజమానుల నుండి నెల వారీగా లేదా సంవత్సరానికి ఒకసారి వరంగల్ ట్రాఫిక్ అధికారికి భారీగానే ముడుపులు ముడుతున్నాయనే ఆరోపణలు స్థానికంగానూ ట్రాఫిక్ సిబ్బంది మధ్య బలంగా వినిపిస్తోంది. పోలీసులకు, అలాగే మున్సిపల్ సిబ్బందికి ముడుపులు ముట్ట జెప్పకుండా ఏ వ్యాపారాలు జరుగవని, ఒక్క ఆటో కూడా రోడ్డుపై నిలబడదు" అని స్థానికులు బహిరంగంగా చెప్పు కుంటున్నారు.

**నగర ప్రజల డిమాండ్**

వరంగల్ నగరంలోని అన్ని ఆటో అడ్డాలను క్రమబద్ధీకరించి, నిర్దేశిత ప్రాంతాలకు మార్చాలని, రోడ్లు, ఫుట్‌పాత్‌ల పై ఆక్రమణలను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగ కుండా, నాయకులకు తలొగ్గకుండా ఎన్‌క్రోచ్‌మెంట్ పై కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ అధికారి ట్రాఫిక్ నియంత్రణ పై రోజువారీ పర్యవేక్షణ ఉండాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# వైసీపీకి భారీ షాక్.

**కీలక నేత చిన్న శ్రీను రాజీనామా.**
**బొత్స సత్యనారాయణ అల్లుడు మజ్జి శ్రీను సంచలన నిర్ణయం..**
**పార్టీ పదవులకు గుడ్‌బై.**



బొత్స సత్యనారాయణ అల్లుడు మజ్జి శ్రీను సంచలన నిర్ణయం..ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అల్లుడు, విజయనగరం జిల్లాలో కీలక నేతగా గుర్తింపు పొందిన మజ్జి శ్రీను అలియాస్ చిన్న శ్రీను పార్టీ పదవులకు రాజీనామా చేశారు. వైసీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడి బాధ్యతలతో పాటు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పదవి నుంచి కూడా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు.ప్రస్తుతం విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగుతున్న చిన్న శ్రీను.. జిల్లాలో బొత్స సత్యనారాయణ తర్వాత పార్టీపై గట్టి పట్టున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరిస్తూ జిల్లాలో వైసీపీ బలోపేతానికి కీలకంగా పనిచేశారు. అలాంటి నేత అకస్మాత్తుగా పార్టీ పదవులకు రాజీనామా చేయడం వైసీపీ శ్రేణుల్లో చర్చకు దారితీసింది.జిల్లా అధ్యక్ష బాధ్యతలతో పాటు భీమిలి సమన్వయకర్త పదవిని కూడా వదులుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే చిన్న శ్రీను తన రాజీనామా లేఖలో పార్టీని వీడడానికి గల కారణాలను స్పష్టంగా వెల్లడించారా? లేదా అన్న అంశంపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆయన నిర్ణయానికి అసలు కారణమేంటన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది.చిన్న శ్రీను వంటి కీలక నేత పార్టీ పదవులకు దూరం కావడంతో విజయనగరం జిల్లాలో వైసీపీ భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై చర్చ మొదలైంది. ఆయన రాజీనామా వెనుక రాజకీయ కారణాలున్నాయా? పార్టీ అంతర్గత పరిణామాల ప్రభావమా? లేక వ్యక్తిగత కారణాలా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మరోవైపు సొంత మేనమామ, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు జిల్లాలో గట్టి రాజకీయ పట్టు ఉంది. బొత్స కుటుంబానికి సన్నిహితుడిగా, కీలక అనుచరుడిగా ఉన్న చిన్న శ్రీను రాజీనామా చేయడం కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. బొత్స ఎందుకు ఈ నిర్ణయాన్ని అడ్డుకోలేకపోయారనే ప్రశ్నలు కూడా పార్టీ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి.టరాష్ట్రవ్యాప్తంగా త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చిన్న శ్రీను రాజీనామా చేయడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రామీణ స్థాయిలో పార్టీ సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో జిల్లా అధ్యక్షుడి పదవిలో ఉన్న కీలక నేత తప్పుకోవడం వైసీపీకి రాజకీయంగా ఇబ్బందికర పరిణామంగా మారింది. అయితే చిన్న శ్రీను తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఆయన పార్టీకి పూర్తిగా దూరమవుతారా? లేక కేవలం పార్టీ పదవులకే రాజీనామా చేసి జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగుతారా? ఇతర రాజకీయ అవకాశాల వైపు అడుగులు వేస్తారా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆయన తదుపరి నిర్ణయం వెలువడితేనే రాజీనామా వెనుక అసలు కారణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# చట్టసభలో తల్లికి అవమానం



“ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి” అన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆవేదన వెనుక కేవలం ఒక రాజకీయ వివాదం లేదు.. ఒక మనిషి గుండెను తాకిన బాధ ఉంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మాటల మధ్య సాగుతున్న తెలంగాణ శాసనసభలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సభను నడిపించాల్సిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టిన దృశ్యం సభలో ఉన్న వారినే కాదు.. ఈ ఘటన గురించి తెలుసుకున్న ప్రతి ఒక్కరినీ కలచివేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలపై చర్చ జరుగుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా రాజకీయ సభల్లో మాటల యుద్ధం కొత్త కాదు. విమర్శలు ఉంటాయి.. ప్రతివిమర్శలు ఉంటాయి. అధికార పక్షం ప్రతిపక్షాన్ని నిలదీస్తుంది.. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంది. కొన్నిసార్లు ఆవేశం పెరుగుతుంది. స్వరం పెరుగుతుంది. కానీ ఆ రాజకీయ పోరాటం ఒక వ్యక్తి కుటుంబం, తల్లి, వ్యక్తిగత గౌరవం వరకు చేరినప్పుడు అది ఇక రాజకీయ వాదనగా మిగలదు. అది ఒక మనిషి మనసును గాయపరిచే ఘటనగా మారుతుంది. ఉదయం అసెంబ్లీ పరిసరాల్లో బీఆర్ఎస్ నాయకుల ఆందోళన సందర్భంగా పోలీసులతో జరిగిన ఘర్షణ నేపథ్యంలో తాతా మధు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర వివాదం చెలరేగింది. ఆ వ్యాఖ్యల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, ఆయన కుటుంబాన్ని అవమానించే పదజాలం ఉన్నట్లు అధికార పక్షం ఆరోపించింది. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను సీఎంవో విడుదల చేసింది. అనంతరం ఈ అంశం శాసనసభలో తీవ్ర చర్చకు దారితీసింది. స్పీకర్ అంటే కేవలం ఒక వ్యక్తి కాదు. ఆయన కూర్చున్న కుర్చీకి రాజ్యాంగబద్ధమైన ప్రాధాన్యం ఉంది. అధికార పక్షానికి చెందినా.. ప్రతిపక్షానికి చెందినా.. సభను నడిపించే సమయంలో స్పీకర్ అందరికీ సమాన దూరంలో ఉండాల్సిన వ్యక్తి. అలాంటి వ్యక్తి వ్యక్తిగతంగా అవమానించబడ్డాననే భావనతో సభలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడం సాధారణ రాజకీయ దృశ్యం కాదు. ముఖ్యంగా మంత్రి సీతక్క మాట్లాడిన సమయంలో పరిస్థితి మరింత భావోద్వేగంగా మారింది. స్పీకర్ తల్లి ప్రస్తావన రావడంతో సీతక్క కూడా తీవ్రంగా కదిలిపోయారు. అణగారిన వర్గానికి చెందిన ఒక బిడ్డ అత్యున్నత రాజ్యాంగ పదవిలో కూర్చోవడం ఆ తల్లి చేసిన నేరమా? అనే భావంతో ఆమె ప్రశ్నించారు. ఒక తల్లిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం ఎంతటి బాధను కలిగిస్తుందో ఆమె సభలో ప్రస్తావించారు. సీతక్క భావోద్వేగానికి లోనైన సమయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ కూడా కన్నీరు పెట్టుకున్నారు. సభాపతి కుర్చీలో కూర్చున్న వ్యక్తి ముందు వందల కోట్ల ప్రజా సమస్యలు ఉంటాయి. రాష్ట్ర భవిష్యత్తుపై చర్చలు ఉంటాయి. చట్టాలపై నిర్ణయాలు ఉంటాయి. ప్రజల తరఫున ఎన్నికైన సభ్యుల మధ్య వాదోపవాదాలు ఉంటాయి. కానీ ఆ కుర్చీలో కూర్చున్న వ్యక్తి కూడా చివరికి ఒక మనిషే. ఆయనకు తల్లి ఉంటుంది. కుటుంబం ఉంటుంది. అనుబంధాలు ఉంటాయి. జ్ఞాపకాలు ఉంటాయి. అవమానం తగిలితే బాధపడే మనసు ఉంటుంది. అందుకే స్పీకర్ కళ్లలో కనిపించిన కన్నీరు కేవలం రాజకీయ స్పందనగా చూడటం ఈ ఘటనను చిన్నబుచ్చినట్లే అవుతుంది. సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌కు జరిగిన అవమానం ఆయన వ్యక్తిగత అవమానం మాత్రమే కాదని, స్పీకర్ పదవికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన అవమానంగా అభివర్ణించారు. తాతా మధును పదవి నుంచి తొలగించాలని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా తాతా మధు ఉపయోగించినట్లు ఆరోపిస్తున్న భాషను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష వాడిన సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంటే ఈ వివాదం కేవలం అధికార పక్షం-బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఘర్షణగా మాత్రమే నిలవకుండా, శాసనసభలోని ఇతర రాజకీయ పక్షాల స్పందనకు కూడా దారితీసింది. ప్రజాస్వామ్యంలో మాట స్వేచ్ఛ అత్యంత విలువైన హక్కు. ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఉంది. ప్రతిపక్షాన్ని నిలదీసే హక్కు ఉంది. సభాపతిని కూడా సభా నిబంధనల పరిధిలో ప్రశ్నించే అవకాశం ఉంది. కానీ వ్యక్తిగత అవమానం, కుటుంబ సభ్యుల ప్రస్తావన, తల్లిదండ్రులపై దూషణ వంటి అంశాలు రాజకీయ చర్చను ఒక ప్రమాదకరమైన స్థాయికి తీసుకెళ్తాయి. రాజకీయ నాయకుల మాటలకు సాధారణ వ్యక్తుల మాటలకంటే ఎక్కువ బరువు ఉంటుంది. ఎందుకంటే వారి మాటలను ప్రజలు వింటారు. యువత వింటుంది. కార్యకర్తలు అనుసరిస్తారు. సమాజం వాటి ప్రభావాన్ని స్వీకరిస్తుంది. ఒక నాయకుడు వేదికపై ఒక మాట మాట్లాడితే అది అక్కడితో ఆగిపోదు. అది సామాజిక మాధ్యమాల్లోకి వెళ్తుంది. వేల మందికి చేరుతుంది. ఆ తర్వాత అదే భాష రాజకీయ సంస్కృతిలో సాధారణంగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈరోజు అసెంబ్లీలో జరిగిన ఘటనను కేవలం తాతా మధు-గడ్డం ప్రసాద్ వివాదంగా చూడకూడదు. ఇది తెలంగాణ రాజకీయ భాష ఎటు వెళ్తోంది? అనే పెద్ద ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. ఒక తల్లి తన బిడ్డను పెంచుతుంది. అతను ఏ స్థాయికి చేరుకున్నా.. తల్లి దృష్టిలో అతను ఎప్పటికీ తన బిడ్డే. అతను ఎమ్మెల్యే అయినా, మంత్రి అయినా, స్పీకర్ అయినా.. తల్లికి అతను అదే కొడుకు. ఆ కొడుకు సభలో గౌరవప్రదమైన స్థానంలో కూర్చుని ఉండగా, తన తల్లి గురించి అవమానకరమైన మాటలు వినాల్సి వస్తే ఆ బాధను పదవితో కొలవలేం. అందుకే సీతక్క మాటలు సభలో అంతటి భావోద్వేగాన్ని రేకెత్తించాయి. ఒకవైపు తల్లి గురించి ప్రస్తావిస్తూ ఆమె కంటతడి పెట్టడం.. మరోవైపు అదే సమయంలో స్పీకర్ భావోద్వేగానికి లోనవడం.. ఈ దృశ్యం సభా రాజకీయాలను ఒక్క క్షణం మానవ సంబంధాల వైపు మళ్లించింది. మన సమాజంలో తల్లికి ఉన్న స్థానం ఏమిటో చెప్పాల్సిన అవసరం లేదు. తల్లిని అవమానించడం అంటే ఒక్క వ్యక్తిని కాదు.. ఒక కుటుంబ భావోద్వేగాన్ని గాయపరచడం. అందుకే రాజకీయ ప్రత్యర్థిపై విమర్శలు చేయడానికి ఎన్ని మార్గాలున్నా, అతని కుటుంబాన్ని, ముఖ్యంగా తల్లిని లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య సంస్కృతికి తగినది కాదనే భావన బలపడుతోంది.

ఇక శాసనసభ విషయానికి వస్తే.. సభాపతి కుర్చీకి ఉన్న గౌరవాన్ని కాపాడటం అధికార పక్షానికే కాదు, ప్రతిపక్షానికీ సమాన బాధ్యత. ఈరోజు ఆ కుర్చీలో కాంగ్రెస్‌కు చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్ ఉన్నారు. రేపు అదే కుర్చీలో మరో పార్టీకి చెందిన వ్యక్తి ఉండవచ్చు.

ఈరోజు అధికార పక్షం ఆ కుర్చీ గౌరవాన్ని కాపాడాలని కోరుతోంది. రేపు ప్రతిపక్షం అదే రక్షణను కోరుకోవచ్చు. అందుకే ఇది కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ సమస్యగా ముగిస్తే అసలు సందేశం మిగలదు. స్పీకర్ వ్యవస్థను ఎలా గౌరవించాలి? రాజకీయ విమర్శలకు ఏ హద్దులు ఉండాలి? ప్రజాప్రతినిధుల భాషకు ఏ ప్రమాణాలు ఉండాలి? అనే ప్రశ్నలకు రాజకీయ వ్యవస్థ సమాధానం చెప్పాల్సిన సందర్భం ఇది.

ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు కూడా ఇదే నేపథ్యంలో వచ్చాయి. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తాతా మధుపై చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పలు రిపోర్టులు పేర్కొన్నాయి. అయితే చర్య ఏదైనా కావచ్చు.. అది నిబంధనల ప్రకారం, ఆధారాల ఆధారంగా, రాజ్యాంగబద్ధంగా ఉండాలి. కానీ ఒక విషయం మాత్రం ఇప్పటికే చరిత్రలో నమోదైంది. చట్టసభలో ప్రసంగాలు రికార్డుల్లో మిగులుతాయి. తీర్మానాలు పుస్తకాల్లో మిగులుతాయి. రాజకీయ ఆరోపణలు కొంతకాలం వార్తల్లో ఉంటాయి. కానీ ఒక సభాపతి కుర్చీలో కంటతడి పెట్టిన దృశ్యం మాత్రం ఒక సమాజం తన రాజకీయ సంస్కృతిని ఎటు తీసుకెళ్తుందో ప్రశ్నించే జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

**గడల నరసింహారావు**
**అసోసియేట్ ఎడిటర్, మహా పత్రిక**

# ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

**న్యూఢిల్లీ:మహా :** ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను భారీగా పెంచడంతో పాటు ఇరు ప్రాంతాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు స్థిరమైన, లాభదాయకమైన అంతర్జాతీయ మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.న్యూఢిల్లీలో మంగళవారం ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు పెంచడంతో పాటు ఇరు ప్రాంతాల మధ్య వాణిజ్యాన్ని విస్తరించే అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. భారత్‌లో అత్యధికంగా వరి సాగు చేసే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. భారీ పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం తెలంగాణకు ఉందని తెలిపారు. ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసే అనుభవం రాష్ట్రానికి ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి లారెల్ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ నుంచి మరింత పెద్ద పరిమాణంలో బియ్యం కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన వెల్లడించినట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు, ఎగుమతిదారులు, రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే విధానంపైనా సమావేశంలో చర్చించినట్లు మంత్రి తెలిపారు. ఫిలిప్పీన్స్‌లో బియ్యం దిగుమతులకు గణనీయమైన డిమాండ్ ఉండటంతో పాటు అంతర్జాతీయంగా బియ్యం సరఫరా చేసే దేశాల పరిధిని విస్తరించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ చర్చలకు ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. పోటీ ధరలు, నాణ్యతలో విశ్వసనీయత, నిర్ణీత సమయంలో పెద్ద మొత్తంలో సరఫరా చేయగల సామర్థ్యంతో తెలంగాణ ఫిలిప్పీన్స్‌కు దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ అవకాశాన్ని తెలంగాణ రైతులు, రైస్ మిల్లర్లు, ఎగుమతిదారులకు ప్రయోజనకరంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బియ్యంతో పాటు విత్తనాలు, మాంస ఉత్పత్తులుబియ్యం ఎగుమతులతో పాటు తెలంగాణ నుంచి మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంపైనా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆసక్తి వ్యక్తం చేసినట్లు ఉత్తమ్ తెలిపారు. ఈ ప్రతిపాదనను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. విత్తనోత్పత్తి, ఆహార శుద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో తెలంగాణకు బలమైన సామర్థ్యం ఉందని మంత్రి అన్నారు. అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. అయితే ఎగుమతులకు సంబంధించిన శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు, అనుమతులు, ఇతర నియంత్రణ అంశాలను పూర్తిగా పరిశీలించాల్సి ఉంటుందని మంత్రి చెప్పారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులతో కలిసి ఈ అంశాలపై అధ్యయనం చేసి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లతో రైతులకు ప్రయోజనం తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరిన్ని అవకాశాలు కల్పిస్తే రైతులతో పాటు రైస్ మిల్లర్లు, విత్తన కంపెనీలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చెందిన అనేక వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రైతులు ఉత్పత్తి చేసే పంటలకు దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయంగా కూడా స్థిరమైన డిమాండ్ ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎగుమతి మార్కెట్లను విస్తరించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను దీర్ఘకాలంపాటు విశ్వసనీయంగా సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక నైపుణ్యం తెలంగాణకు ఉన్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణను అంతర్జాతీయ వ్యవసాయ ఎగుమతుల కేంద్రంగా మరింత బలోపేతం చేయడంతో పాటు రాష్ట్ర రైతులకు స్థిరమైన, లాభదాయకమైన మార్కెట్లను సృష్టించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



# బ్రిక్స్ ‘పవర్’: ఆచరణలో విశ్వాసం ఉంటేనే నిజమైన శక్తి




న్యూఢిల్లీ వేదికగా జరగనున్న 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచ వేదికపై భారతదేశ పెరుగుతున్న ప్రాబల్యానికి, గ్లోబల్ సౌత్ దేశాల ఆశలకు స్పష్టమైన నిదర్శనం. చైనా రాయబారి జు ఫీహాంగ్ తన తాజా వ్యాసంలో ప్రతిపాదించిన బ్రిక్స్ 'POWER' అంటే ప్రిన్సిపల్ ఓపెన్నెస్, విన్‌విన్, ఇంజన్, రెస్పాన్సిబిలిటీ వరుసగా తెలుగు భాషలో సూత్రం, పారదర్శకత, ఉభయతారకం, చోదకశక్తి, బాధ్యత అనే పంచసూత్ర భావన సైద్ధాంతికంగా ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఒక భారతీయ పౌరుడి కోణంలో చూసినప్పుడు, ఈ లక్ష్యాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, వాటి వెనుక ఉన్న అసలైన స్ఫూర్తి ఆచరణలో ఎంతవరకు సాధ్యపడుతుందనేది కీలకమైన ప్రశ్న.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాదాపు 30 శాతం వాటాతో, భవిష్యత్ ప్రపంచ వృద్ధికి ప్రధాన చోదక శక్తిగా (ఇంజన్) బ్రిక్స్ ఎదుగుతోంది. 2028 నాటికి జి7 దేశాల వృద్ధి రేటు కంటే బ్రిక్స్ వృద్ధి దాదాపు మూడు రెట్లు వేగంగా ఉంటుందన్న అంచనాలు ఈ కూటమి ఆర్థిక సత్తాకు నిదర్శనం. పాశ్చాత్య దేశాల ఆధిపత్యాన్ని, రక్షణవాద విధానాలను ఎదుర్కొని, పారదర్శకమైన (ఓపెన్నెస్) వాణిజ్య వ్యవస్థను నిర్మించడంలో భారత్, చైనాలు కలిసి అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.మారుతున్న కాలానికి అనుగుణంగా కేవలం వాణిజ్యమే కాకుండా సాంకేతికతపై దృష్టి సారించడం హర్షణీయం. డిజిటల్ ఎకానమీ, స్మార్ట్ తయారీ రంగాలతో పాటు విద్య, వైద్యం, ముఖ్యంగా వ్యవసాయం వంటి కీలక రంగాలలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని ప్రోత్సహించడంలో బ్రిక్స్ దేశాలు పరస్పరం సహకరించుకోవాలి. వాతావరణ మార్పులు, ఆహార భద్రత వంటి సవాళ్లను ఎదుర్కొంటూనే, ఐక్యరాజ్యసమితి 2030 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (ఎస్.డి.జి లు) సాధించడంలో, అలాగే 2030 అనంతర ప్రపంచ అభివృద్ధి ఎజెండాను రూపొందించడంలో బ్రిక్స్ నాయకత్వం వహించాలి. ఈ ఉభయతారక (విన్‌విన్) వ్యూహం అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటికీ మేలు చేస్తుంది.అయితే, చైనా రాయబారి ఆశించిన ఈ ఉన్నత లక్ష్యాలకు, బాధ్యతకు (రెస్పాన్సిబిలిటీ) నిజమైన ప్రాణం క్షేత్రస్థాయి వాస్తవాలలోనే ఉంది. రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన ప్రయాణాలు, సరిహద్దు వాణిజ్యం పునరుద్ధరించబడటం సానుకూల పరిణామమే అయినప్పటికీ, ద్వైపాక్షిక సంబంధాలకు ప్రాథమిక పునాది 'నమ్మకం'. వాస్తవాధీన రేఖ (ఎల్.ఎ.సి) వద్ద పూర్తిస్థాయిలో శాంతి, యథాతథ స్థితి నెలకొనకుండా ఈ భాగస్వామ్యం పూర్తిగా ఫలవంతం కాలేదు.సార్వభౌమాధికారాన్ని గౌరవించడం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం అనే సూత్రాలను (ప్రిన్సిపల్) చైనా త్రికరణ శుద్ధిగా పాటించాలి. వ్యవసాయం నుండి ఏ.ఐ వరకు మనం నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలన్నా, 2028 ఆర్థిక అంచనాలు నిజం కావాలన్నా, 2030 సుస్థిర అభివృద్ధి ఎజెండాను ప్రపంచానికి అందించాలన్నా.. ఆసియా దిగ్గజాలైన భారత్, చైనాల మధ్య మాటలకు, చేతలకు మధ్య అంతరం తగ్గాలి. న్యూఢిల్లీ వేదికగా జరగబోయే సదస్సు కేవలం ప్రకటనలకు పరిమితం కాకుండా, సమానత్వం మరియు పరస్పర గౌరవంతో కూడిన ఆచరణాత్మక అడుగులకు నాంది పలకాలి. అప్పుడే ఈ 'బ్రిక్స్ పవర్' నిజంగా ప్రపంచానికి దిశా నిర్దేశం చేయగలదు.

**(శివ కుమార్ గనివాడ, సీనియర్ అగ్రికల్చర్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పర్ట్)**
**ganiwada@zohomail.in**

# కేసీఆర్ క్షమాపణ చెబితే హుందాతనం పెరిగేది

- **స్పీకర్‌పై అనుచిత భాష సరికాదు.**
- **తాతా మధు వ్యాఖ్యలను తప్పుబట్టిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో దుమారం కొనసాగుతోంది. ఈ వ్యవహారంపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రంగా స్పందించారు. శాసనసభాపతి వంటి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత భాషలో వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన అన్నారు.మంగళవారం హైదరాబాద్‌లో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను తప్పుబట్టారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ సభాపతి స్థానాన్ని గౌరవించాల్సిందేనని అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా శాసనసభకు హాజరై తమ పార్టీ ఎమ్మెల్సీ చేసిన తప్పును క్షమించాలని కోరితే ఆయన హుందాతనం మరింత పెరిగేదని కూనంనేని వ్యాఖ్యానించారు. తప్పు జరిగిందని అంగీకరించి క్షమాపణ కోరడం వల్ల నాయకుడి స్థాయి తగ్గదని, పైగా గౌరవం పెరుగుతుందని అన్నారు.శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలకు తావివ్వడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు మంచిది కాదని కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజల తరఫున చట్టసభకు ఎన్నికైన ప్రతినిధులు తమ మాటలు, ప్రవర్తన విషయంలో సంయమనం పాటించాలని సూచించారు.



# పోలీసుల తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు.

**హైదరాబాద్:మహా :** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ఇటీవల చోటుచేసుకున్న ఉద్రిక్త పరిణామాలు, పోలీసుల వ్యవహారశైలిపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. అసెంబ్లీ గేటు వద్ద నిరసన సందర్భంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆ పార్టీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయాలని బీఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించింది.ఈ మేరకు బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతల ప్రతినిధి బృందం బుధవారం మధ్యాహ్నం 12:45 గంటలకు లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలవనుంది. అసెంబ్లీకి వెళ్తున్న ప్రతిపక్ష సభ్యులను పోలీసులు అడ్డుకోవడం, నిరసన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై గవర్నర్‌కు వివరించనున్నారు.ముఖ్యంగా మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. నిరసన సందర్భంగా తమ పార్టీ ప్రజాప్రతినిధులపై భౌతికంగా దాడికి పాల్పడ్డారని పేర్కొంటూ, ఘటనకు సంబంధించిన వివరాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లనుంది.

**ఎమ్మెల్యేల హక్కులపై ఫిర్యాదు**

ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడం రాజ్యాంగబద్ధమైన హక్కులకు విఘాతం కలిగించడమేనని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే ప్రతిపక్ష సభ్యులపై పోలీసులను ఉపయోగించి అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని విమర్శిస్తున్నారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలు, మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు వ్యవహరించిన తీరుపై సమగ్రంగా వివరించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**రాజకీయంగా వేడెక్కిన వాతావరణం**

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య ఇప్పటికే రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, 22A భూములు, రైతులు, నిరుద్యోగులు తదితర అంశాలపై ప్రతిపక్షం ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీ గేటు వద్ద నిరసనలు, పోలీసులతో వాగ్వాదాలు, మహిళా ఎమ్మెల్యేల వ్యవహారం రాజకీయంగా మరింత దుమారం రేపింది. తాజాగా గవర్నర్‌ను కలసి ఫిర్యాదు చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో ఫిర్యాదు అందజేసి, ప్రజాప్రతినిధుల హక్కులను పరిరక్షించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకునేలా జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం కోరనుంది. గవర్నర్ స్పందన ఎలా ఉంటుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# పెద్దపల్లి రెవెన్యూ శాఖ లో అవినీతి ఆరోపణలు!?

- **భూ వ్యవహారాల్లో అధికారుల తీరు పై విమర్శలు**
- **జిల్లాస్థాయిలో ఉన్నతాధికారి మౌనం పై అనుమానం**

**పెద్దపల్లి, మహా ; సెప్టెంబర్ 08 :** పెద్దపల్లి జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వ్యవహారాలు మరోసారి చర్చకు దారి తీసింది. భూముల రికార్డులు, సర్వేలు, పట్టాదారు పాస్ బుక్కులు, మ్యుటేషన్‌లు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పనులు, భూ వివాదాల పరిష్కారం వంటి అంశాల్లో చాలావరకు అవినీతి పేరుకుపోయిందని దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. దీంతో పాటు కొందరు రెవెన్యూ సిబ్బంది పై అవినీతి ఆరోపణలు కూడా వెలుగులోకి వస్తున్నాయి.

గతంలో ఏసీబీకి చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటి సంఘటనలు చోటు చేసుకోనున్నాయి రెవెన్యూ కార్యాలయాల్లో ప్రజల పనులు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా? లేక మధ్యవర్తుల ప్రమేయంతో డబ్బుల లావాదేవీలు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా జిల్లాస్థాయిలో ఓ ఉన్నతాధికారి కూడా ఇందులో భాగస్వామ్యం అయ్యారని కార్యాలయంలో గుసగుసలు వినబడుతున్నాయి. అవినీతి అధికారులు పై కఠిన చర్యలు అవసరం అని భూ సంబంధిత పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే సామాన్య ప్రజలు తమ పనులు త్వరగా పూర్తిచేసుకునేందుకు మధ్యవర్తులను ఆశ్రయించాల్సి దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. అయితే ఇలాంటి ఆరోపణలకు సంబంధించి ప్రతి అంశాన్ని ఆధారాలతో విచారించి వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రెవెన్యూ శాఖలో అవినీతికి ఆస్కారం ఉన్న అంశాల పై నిరంతర నిఘా, ఆకస్మిక తనిఖీలు, ఫిర్యాదుల పై తక్షణ విచారణ, బాధ్యుల పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**భూ రికార్డులే కీలకం**

భూ భారతి అమలుతో భూ రికార్డుల్లో పారదర్శకత పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రికార్డుల మార్పులు, సర్వేలు, మ్యుటేషన్‌లు, వారసత్వ హక్కులు, నాలా కన్వర్షన్, 22ఏ తదితర అంశాల్లో వివాదాలు కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది.ప్రత్యేకించి భూముల విలువ పెరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ రికార్డుల్లో ఒక్క చిన్న తప్పిదం కూడా రైతులు, భూయజమానులకు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉంది. అందువల్ల ప్రతి దరఖాస్తుపై అధికారులు తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులు, విచారణ వివరాలు, ఆధారాలు అందుబాటులో ఉండేలా పారదర్శక వ్యవస్థ అవసరం.

**"ఎవరి ప్రమేయం ఎంత?"**

ఒక ఉద్యోగి లేదా అధికారి ఏసీబీకి చిక్కిన ప్రతిసారి ఆ వ్యక్తితో వ్యవహరించిన మధ్యవర్తులు, ఇతర సిబ్బంది, పై స్థాయి అధికారుల పాత్ర పై కూడా ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతుంటాయి. అయితే ఆరోపణ ఉన్నంత మాత్రాన ఎవరికైనా నేరం ఆపాదించకుండా, ఏసీబీ విచారణలో తేలిన అంశాల ఆధారంగానే బాధ్యతను నిర్ణయించాల్సి ఉంటుంది.అంతర్గ ఘటన నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలోని ఇతర రెవెన్యూ కార్యాలయాల్లోనూ అవినీతి నిరోధక చర్యలను మరింత బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.అధికారుల పై ప్రజల ప్రశ్నలురెవెన్యూ కార్యాలయాల్లో మధ్యవర్తుల ప్రమేయాన్ని పూర్తిగా అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?భూ సంబంధిత దరఖాస్తులు పరిష్కరించడంలో జాప్యానికి బాధ్యులు ఎవరు? అవినీతి ఆరోపణల పై వచ్చిన ఫిర్యాదుల పై ఎన్ని విచారణలు జరిగాయి? భూ రికార్డుల మార్పులు, మ్యుటేషన్‌లు, సర్వేలకు సంబంధించిన ఫిర్యాదులపై జిల్లా స్థాయిలో ఎలాంటి పర్యవేక్షణ ఉంది?ప్రజలు నేరుగా అధికారులను సంప్రదించే అవకాశం ఉన్నప్పటికీ మధ్యవర్తుల అవసరం ఎందుకు ఏర్పడుతోంది? మధ్యవర్తుల ద్వారానే అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శలు కూడా వెలువడుతున్నాయి.



**ప్రజలకు పారదర్శక పాలన అందించాలి**

రెవెన్యూ శాఖ ప్రజల భూమి, ఆస్తి హక్కులతో నేరుగా ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన విభాగం. అందువల్ల అవినీతి ఆరోపణలు వచ్చిన ప్రతిసారి వాటిని కేవలం వ్యక్తిగత ఘటనగా కాకుండా, వ్యవస్థలో లోపాలు ఉన్నాయా అనే కోణంలోనూ పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**రెవెన్యూ శాఖలో అక్రమ వసూళ్ల పై ఆరోపణలు?**

పెద్దపల్లి జిల్లాలో కొందరు రెవెన్యూ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడి, ఆ మొత్తాలను జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారనే అపవాదులు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పెద్దపల్లి జిల్లాలో రెవెన్యూ శాఖ పై వస్తున్న ఆరోపణలు, ఏసీబీ చర్యలు, భూ వ్యవహారాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై స్వతంత్రంగా, పారదర్శకంగా సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని పలువురు కోరుతున్నారు..

**జిల్లాలో రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాలి.!**

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి, అవినీతి-నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శక పాలన అందించాలి. రెవెన్యూ వ్యవస్థలో రాజకీయ జోక్యానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లాలో రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసి, అధికారుల పై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాల్సి ఉంటుంది.

**రెవెన్యూ శాఖలో బదిలీలు చేపట్టాలి!**

ఒకే చోట దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై అవినీతి ఆరోపణలకు ఆస్కారం ఏర్పడుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్దపల్లి జిల్లాలో దీర్ఘకాలంగా ఒకే స్థానంలో పనిచేస్తున్న వారిని బదిలీ చేసి, పారదర్శకమైన పరిపాలనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



## హక్కుల కోసం హైదరాబాద్ బాట

కరీంనగర్ మహా: ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈహెచ్‌ఎస్ అమలులో జాప్యం, ఉద్యోగుల బకాయిలు, పీఆర్‌సీ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, రాజ్యాంగబద్ధంగా తమకు రావాల్సిన హక్కులను మాత్రమే కోరుతున్నారని స్పష్టం చేశారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగులకు అమలవుతున్న సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగుల భవిష్యత్తును మార్కెట్ హెచ్చుతగ్గులకు ముడిపెట్టవద్దని అన్నారు. పెండింగ్ బకాయిలను చెల్లించి, పీఆర్‌సీ సమస్యను పరిష్కరించడంతో పాటు ఈహెచ్‌ఎస్‌లోని లోపాలను సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. "పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు" అని నాయకులు స్పష్టం చేశారు. చలో హైదరాబాద్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.



## ఏఈ రవీందర్‌కు ఘన సన్మానం

**పెద్దపల్లి మహా, సెప్టెంబర్ 08:** పెద్దపల్లి జిల్లాలో విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేసిన బి. రవీందర్ (SPM, పెద్దపల్లి) పదవీ విరమణ సందర్భంగా సహచరులు, అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.







## పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఎత్తుకెళ్లాడు!

- **గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్.. క్యాప్ పెట్టుకుని పోలీస్ అవతారం**
- **డివైడర్‌ను ఢీకొట్టి.. వాహనాలను ఆపేందుకు యత్నం.. చివరకు పోలీసులకు చిక్కిన వైనం**

**కరీంనగర్, మహా**: పోలీసుల పెట్రోలింగ్ వాహనాన్నే ఓ యువకుడు ఎత్తుకెళ్లడం కరీంనగర్ జిల్లాలో కలకలం రేపింది. గంజాయి మత్తులో ఉన్న యువకుడు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పెట్రోలింగ్ వాహనాన్ని తీసుకెళ్లి ర్యాష్ డ్రైవింగ్‌తో హల్‌చల్ చేశాడు. ఎల్కతుర్తి సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టిన అనంతరం పోలీస్ క్యాప్ పెట్టుకుని రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఆపేందుకు ప్రయత్నించాడు. పెట్రోలింగ్ వాహనం కనిపించకపోవడంతో కరీంనగర్ రూరల్ పోలీసులు వెంటనే అప్రమత్తమై గాలింపు చేపట్టారు. మరోవైపు ఎల్కతుర్తి సమీపంలో పోలీస్ వాహనంతో ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని అక్కడి పోలీసులు గుర్తించారు. క్యాప్ ధరించి వాహనాలను ఆపేందుకు ప్రయత్నిస్తుండటంతో అనుమానం వచ్చి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే వాహనం మిస్సింగ్‌పై గాలిస్తున్న రూరల్ పోలీసులు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఎల్కతుర్తి పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని, పెట్రోలింగ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యువకుడిని వాహనంతో సహా కరీంనగర్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు యువకుడి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. వాహనం ఎలా చోరీ చేశాడు? అతడి వెనుక ఎవరైనా ఉన్నారా? అనే కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు.

## గణేష్ మండపాలకు పోలీస్ నిబంధనలు..

**వలిగొండ ఎస్సై కీలక సూచనలు**

**వలిగొండ, సెప్టెంబర్ 8 (మహా న్యూస్):** వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని వలిగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ, మున్సిపల్ లేదా గ్రామపంచాయతీ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. రాకపోకలకు అంతరాయం కలిగించేలా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. ధ్వని కాలుష్య నియమాలను పాటించాలని, డీజేల వినియోగంపై నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రివేళల్లో నిర్వాహకులు కాపలా ఉండాలని సూచించారు. శోభాయాత్రకు పోలీసుల ముందస్తు అనుమతి తప్పనిసరని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఏజెన్సీ అమ్మాయి.. రాష్ట్ర క్రికెట్ జట్టుకు..

- **అండర్-19 స్టేట్ టీంకు మణుగూరు నేహా ఎంపిక..**
- **కుమార్తె ప్రతిభకు పదును పెట్టిన హోంగార్డు కళ్యాణ్**
- **నిరంతర సాధన.. క్రమశిక్షణతో రాష్ట్రస్థాయికి**

**మణుగూరు, మహా :** ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఓ హోంగార్డు కుమార్తె క్రికెట్‌లో సత్తాచాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైంది. మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న గుండెల కళ్యాణ్ కుమార్తె గుండెల నేహా ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన హెచ్‌సీఏ అండర్ 19 క్రికెట్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి స్టేట్ అండర్ 19 జట్టుకు ఎంపికైంది. చిన్ననాటి నుంచే క్రికెట్‌పై ఆసక్తి చూపుతున్న నేహాలోని ప్రతిభను గుర్తించిన తండ్రి కళ్యాణ్ ఆమెను ప్రోత్సహిస్తూ వచ్చారు. విధి నిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ కుమార్తె సాధనకు అవసరమైన సహకారం అందిస్తూ, క్రమశిక్షణతో కూడిన ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ఖమ్మంలోని రాజశేఖర్ క్రికెట్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న నేహా నిరంతర సాధనతో తన ఆటతీరుకు పదును పెట్టుకుంది. తండ్రి ప్రోత్సాహానికి తన పట్టుదల, క్రమశిక్షణను జోడించి రాష్ట్రస్థాయి వరకు ఎదిగింది. తాజాగా నిర్వహించిన హెచ్‌సీఏ అండర్ 19 సెలక్షన్స్‌లో తన ప్రతిభను చాటిన నేహా సెలక్టర్ల దృష్టిని ఆకర్షించి రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకుంది. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు నుంచి ఓ యువ క్రీడాకారిణి రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం స్థానిక క్రీడాభిమానుల్లో ఆనందం నింపింది. సాధారణ హోంగార్డుగా పనిచేస్తూనే కుమార్తె క్రీడా భవిష్యత్తుకు అండగా నిలిచిన కళ్యాణ్‌ను, రాష్ట్ర జట్టుకు ఎంపికైన నేహాను స్థానికులు, క్రీడాభిమానులు అభినందించారు. ఇదే పట్టుదలతో రాణించి భవిష్యత్తులో జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



## స్పీకర్‌ను కించపరిస్తే సహించం!

- **తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలి**
- **అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.. కేసీఆర్ దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి**
- **బీఆర్ఎస్ తీరుపై మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ధ్వజం**



**కరీంనగర్ మహా** : దళిత స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి డిమాండ్ చేశారు. తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దళిత సమాజానికి, సభ్య సమాజానికి క్షమాపణ చెప్పాలని కోరారు.కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ లింగంపల్లి బాబుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారంపై తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగిన నేపథ్యంలో తాతా మధు, మరో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదై, వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తాజా సమాచారం వెల్లడిస్తోంది.

**'దళితుడైన స్పీకర్‌ను అవమానించడం దారుణం'**

ఒకవైపు భారతీయులు సాంకేతిక రంగంలో ప్రపంచస్థాయిలో దేశానికి గర్వకారణంగా నిలుస్తుంటే.. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు కుల వివక్షతో కూడిన పాత రాజకీయ ధోరణులను ప్రదర్శించడం సిగ్గుచేటని శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై మీడియా ముందు అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనన్నారు. ఈ వ్యవహారంపై స్పీకర్ సభలో భావోద్వేగానికి గురైన విషయం కూడా తీవ్ర చర్చకు దారితీసింది.

**'బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక వైఖరి'**

బీఆర్ఎస్ నాయకులు ప్రతిపక్షంలో ఉండటాన్ని జీర్ణించుకోలేక ప్రభుత్వంపై అసహనంతో వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ నెరవేర్చలేదని ఆరోపించారు.దళిత నాయకుడు సీఎల్పీ నేతగా ఉన్న సమయంలో ప్రతిపక్ష వ్యవస్థను బలహీనపరిచేలా వ్యవహరించారని విమర్శించారు. నేడు దళితుడు స్పీకర్ స్థానంలో ఉండటాన్ని కూడా ఆ పార్టీ జీర్ణించుకోలేక పోతోందని ఆరోపించారు.

**'కాంగ్రెస్‌లోనే బలహీన వర్గాలకు గౌరవం'**

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు గౌరవం ఇచ్చి కీలక పదవులు కల్పిస్తున్న పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. దళిత నాయకులకు డిప్యూటీ సీఎం, స్పీకర్ వంటి కీలక బాధ్యతలు అప్పగించడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ జిల్లాకు చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రి పదవి కల్పించడం కూడా సామాజిక న్యాయానికి ఉదాహరణ అన్నారు.

**'అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ డ్రామా'**

అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ నేతలు నల్ల దుస్తులతో చేసిన నిరసనపై కూడా ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, మహిళా పోలీసుల సమక్షంలో అసభ్యకరంగా ప్రవర్తించడం సమర్థనీయం కాదన్నారు.

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

**'తాతా మధు రాజీనామా చేసే వరకు పోరాటం'**

తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీరామ్ చక్రవర్తి డిమాండ్ చేశారు. కేసీఆర్ దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ డిమాండ్లపై తాతా మధు రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**'అట్రాసిటీ కేసు పెట్టాలి'**

కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బీఆర్ఎస్ నేతలు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు అవుతున్నా కుల వివక్షకు తావివ్వడం బాధాకరమన్నారు. దేశం అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడుతున్న సమయంలో దళిత ప్రజాప్రతినిధులను కులపరంగా దూషించడం దేశానికే అవమానమని అన్నారు.

ఈ సమావేశంలో కార్పొరేటర్ వరాల నరసింగం, నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ అలీ, కాంగ్రెస్ నాయకులు జీడి రమేష్, చింతల కిషన్, మాదాసు శ్రీనివాస్, బొమ్మరాతి సాయికృష్ణ, కూడలి శ్రీధర్, తిరుపతి, ముద్దసాని క్రాంతి, పెంట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్ ఇచ్చిన ట్రైనింగ్ ఇదేనా?

- **గూండాయిజం, రౌడీయిజం చేయమని చెప్పి పంపించారా?**
- **స్పీకర్‌పై కుసంస్కారంగా మాట్లాడి.. సిగ్గులేకుండా రోడ్లపై ధర్నాలా?**
- **తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలి**
- **బీఆర్ఎస్ నేతల తీరుపై సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఫైర్**



**కరీంనగర్, మహా:** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఇచ్చిన శిక్షణ ఇదేనా అని ప్రశ్నించారు. గూండాయిజం, రౌడీయిజం చేయాలని, కుసంస్కారంగా మాట్లాడాలని చెప్పి వారిని అసెంబ్లీకి పంపించారా అని నిలదీశారు.కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాల వేసిన అనంతరం అక్కడే నిర్వహించిన మీడియా సమావేశంలో నరేందర్‌రెడ్డి మాట్లాడారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.

**స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరమని నరేందర్‌రెడ్డి అన్నారు. స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, ఆ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు.

స్పీకర్‌పై అనుచితంగా మాట్లాడిన తర్వాత కూడా ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా బీఆర్ఎస్ నేతలు రోడ్లపై ధర్నాలు, ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సింది పోయి.. గూండాయిజం, రౌడీయిజం తరహా ప్రవర్తనకు పాల్పడటం సిగ్గుచేటన్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజలు ఖండిస్తున్నారు

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ.. ఆ నిరసనకు కూడా ఒక పద్ధతి, హద్దు ఉంటుందని చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను గౌరవించకుండా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

**కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలి**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గుండాయిజం, ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వ్యవహారశైలిపై కేసీఆర్ వివరణ ఇవ్వాలని అన్నారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకత్వం సమర్థిస్తుందా? లేక ఖండిస్తుందా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించే నాయకులపై పార్టీ పరంగా, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా బీఆర్ఎస్ తీరు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నరేందర్‌రెడ్డి.. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలను ప్రతి రాజకీయ పార్టీ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా పదవులు పొందిన ప్రజాప్రతినిధులు అదే రాజ్యాంగ వ్యవస్థలను అవమానించేలా వ్యవహరించడం సరికాదన్నారు.బీఆర్ఎస్ నేతలు తమ వైఖరిని మార్చుకుని ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని నరేందర్‌రెడ్డి హితవు పలికారు.



## మహిళా ఎమ్మెల్యేల అరెస్టు సిగ్గుచేటు..

- **హామీలపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా..?**
- **ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని..**
- **పినపాక నియోజకవర్గ మహిళా నేతల డిమాండ్**

**మణుగూరు, మహా** : ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యలపై ప్రశ్నించిన మహిళా ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం సిగ్గుచేటని పినపాక నియోజకవర్గ మహిళా నాయకులు మండిపడ్డారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాప్రతినిధుల బాధ్యతని, అలాంటి వారి గొంతును కేసులు, అరెస్టులతో అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల అరెస్టులను నిరసిస్తూ మణుగూరులో మంగళవారం మహిళా నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బూర్గంపాడు మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించడంతోపాటు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు పాకాల రమాదేవి, సర్పంచులు మడి స్వరూప, కొమరం జంపేశ్వరి, యదలపల్లి శారద, ఎస్కే కరిష్మా బేగం, బొగ్గం రజిత, కర్నే సుహాసిని, మేకల జ్యోత్స్న, అడపాల సత్యవతి, మేకల సుప్రియ, బోయల సృజన, మార్గం శ్రీలత, తిప్పలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, పోసం ముత్యం, బాబు నరసింహారావు, యాదగిరి గౌడ్, ప్రభుదాస్, ఆవుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వే పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: పాల్వంచ మండలంలోని బోజ్యా తండా పరిధిలో చేపడుతున్న భూముల రీసర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వేలో భాగంగా సర్వే అధికారులు రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానాన్ని, క్షేత్రస్థాయిలో భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం హద్దులు స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో భూముల రీసర్వే చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో రీసర్వే పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వే పురోగతి మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు సర్వేకు అవసరమైన సిబ్బంది పరికరాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.భూముల రీసర్వేలో భాగంగా ప్రతి భూ యజమానికి సంబంధించిన భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా



కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గ్రమంలో భూరీసర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి అవసరమైన వివరాలు రికార్డులు పత్రాలు సేకరించి భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. భూముల విషయంలో భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి రీసర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూపత్రాలను పరిశీలించారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు క్షేత్రస్థాయిలో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని రైతులకు సూచించారు. భూముల రీసర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులు విస్తీర్ణం తదితర వివరాలు మరింత స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్డ్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులో యంత్రాల అపహరణ

**క్యాతనపల్లి మహా :** మున్సిపాలిటీ పరిధి ఆర్కే 1 సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో యంత్రాల ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. డంపింగ్ యార్డులో యంత్రాలు కనిపించకపోవడాన్ని గమనించిన మున్సిపల్ సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన యంత్రాల విలువ సుమారు లక్ష యాభై వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ జాడి శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డంపింగ్ యార్డులోకి ఎవరు ప్రవేశించారు, యంత్రాలను ఎప్పుడు, ఎలా తరలించారు అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు పేర్కొన్నారు. అపహరణకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## కార్మికులు వాస్తవాలను గ్రహించాలి..

- **ఏఐటీయూసీపై విష ప్రచారాన్ని నమ్మొద్దు**
- **24 డిమాండ్లపై చారిత్రక ఒప్పందం**
- **ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్**

**మణుగూరు, మహా** : సింగరేణి కార్మికులు వాస్తవాలను గ్రహించి, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ కోరారు. మణుగూరు ఏరియా వర్క్‌షాప్‌లో మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మికుల సమస్యలు, హక్కులకు సంబంధించి ఏఐటీయూసీ సాధించిన ఒప్పందాలను వివరించారు. సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపన్ను, సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షలు, దసరాలోపు లాభాల వాటా పంపిణీ, ప్రతి నెల మెడికల్ బోర్డు ఏర్పాటు, పెండింగ్ డిపెండెంట్లకు ఉద్యోగాలు, మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్, ఈఅండ్ఎం సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లకు తగిన డిజిగ్నేషన్లు, రక్షణ పరికరాల కొనుగోలు, సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన తదితర 24 డిమాండ్లపై ఒప్పందం జరిగిందని తెలిపారు. ఈ ఒప్పందాన్ని జీర్ణించుకోలేని కొన్ని సంఘాలు సోషల్ మీడియా ద్వారా కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. ఏఐటీయూసీని విమర్శించే వారు గతంలో అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల ఏ హక్కులపై ఒప్పందాలు సాధించారో చెప్పాలని ప్రశ్నించారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ చేపట్టిన 'సేవ్ మణుగూరు' ఉద్యమం ఫలితంగా మణుగూరు ఏరియా మనుగడ మరో 30 ఏళ్లు పెరిగిందన్నారు. 12వ వేజ్‌బోర్డు ఏర్పాటు కోసం ఏఐటీయూసీతోపాటు జాతీయ కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనల ఫలితంగా వేజ్‌బోర్డు కమిటీ ఏర్పాటుకు కోల్ ఇండియా యాజమాన్యం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 12వ వేజ్‌బోర్డును ఏర్పాటు చేయకపోతే కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యుడు ఆవుల నాగరాజు, పిట్ సెక్రటరీ వి.సతీష్, వినయ్ వినీల్, టి.పూర్ణచందర్, సత్తు ప్రవీణ్, నక్క రవి, గూడ సందీప్, శ్రావణ్‌కుమార్, కమలాకర్, ప్రవీణ్, నాగరాజు, ప్రసాద్‌గౌడ్, మురళి, అనిల్, అమర్ పాల్గొన్నారు.

## పదేళ్లు గడిచినా మారని కార్యాలయ బోర్డు




- **పశుసంవర్ధక శాఖలో అధికారుల నిర్లక్ష్యం**
- **ఆర్టీఐ చట్ట నిబంధనల అమలుపైనా నిర్లక్ష్యమే**
- **అసహనం వ్యక్తపరచిన పొన్నెకంటి సంజీవరాజు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడి దాదాపు పదేళ్లు గడుస్తున్నా.. జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో మాత్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆనవాళ్లు తొలగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు ఆరోపించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం వద్ద ఇప్పటికీ గత ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన బోర్డు దర్శనమిస్తోందని ఆయన పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన జరిగి ఇంతకాలం గడిచినా కార్యాలయ బోర్డుపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరును సూచించకపోవడం అధికారుల పనితీరును ప్రశ్నించేలా ఉందన్నారు. సహాయ సంచాలకుల కార్యాలయం మొదటి అంతస్తులో కొనసాగుతుండగా కింది భాగంలో పశువుల ఆసుపత్రి నిర్వహిస్తున్నారని సంజీవరాజు తెలిపారు. అయితే ఆసుపత్రికి కనీసం బోర్డు కూడా లేకపోవడం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించే విధంగా వివరాలు ప్రదర్శించకపోవడం పట్ల ఆయన ఆక్షేపించారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం-2005కు సంబంధించి అప్పిలేట్ అధికారి, సహాయ అప్పిలేట్ అధికారి పేర్లు, నోటీస్ బోర్డు, కార్యాలయ సిబ్బంది వివరాలు వంటి కీలక సమాచారాన్ని కూడా ప్రజలకు అందుబాటులో ఉంచలేదని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందాల్సిన సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించాల్సిన అవసరం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరుతో నూతన బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు పశువుల ఆసుపత్రికి ప్రత్యేక బోర్డు ఆర్టీఐ చట్టానికి సంబంధించిన అధికారుల వివరాలు నోటీస్ బోర్డు సిబ్బంది వివరాలను ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేయాలని పొన్నెకంటి సంజీవరాజు కోరారు. అధికారుల నిర్లక్ష్యానికి ముగింపు పలికి ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని ఆయన డిమాండ్ చేశారు.



## విఎన్ఆర్ కాలనీలో సోలార్ ప్లాంట్ షార్ట్ సర్క్యూట్!

- **త్రుటిలో తప్పిన ప్రాణనష్టం..**
- **కంట్రోల్ యూనిట్లను ప్రత్యేక గదికి మార్చాలని ఐఎన్‌టీయూసీ డిమాండ్**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 8:మహా :** సింగరేణి కార్మికుల వసతి గృహాలైన పి.వి.ఎన్.ఆర్. కాలనీలోని సోలార్ పవర్ సిస్టమ్ వద్ద మళ్లీ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం చోటుచేసుకుంది. సోలార్ ప్యానెళ్ల నుంచి వచ్చే డీసీ వైరింగ్, కంట్రోల్ బాక్స్ విభాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కంట్రోల్ యూనిట్, వైరింగ్ పరికరాలు దగ్ధమయ్యాయి. గోడలు నల్లబడి బూడిదగా మారాయి. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. గతంలోనూ ప్రమాదంఇదే ప్రాంతంలో గతంలోనూ ఇలాంటి ఘటన జరిగిన నేపథ్యంలో తాజా ప్రమాదంపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైరింగ్ లోపాలు, లూజ్ కనెక్షన్లు లేదా సాంకేతిక కారణాలపై సమగ్ర విచారణ జరిపి అసలు కారణాలను గుర్తించాలని కోరుతున్నారు.

**జీఎం దృష్టికి భద్రతా అంశం**

ప్రమాద విషయం తెలుసుకున్న ఐఎన్‌టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు జీఎం వెంకటాచారితో మాట్లాడి ఘటన వివరాలను తెలియజేశారు. కాలనీ నివాస ప్రాంతంలో కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని, అక్కడ కంట్రోల్ యూనిట్లు ఉండటం ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కంట్రోల్ యూనిట్లను తొలగించి, కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ ప్యానెల్ యూనిట్ రూమ్‌కు తరలించాలని కోరారు. నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సానుకూలంగా స్పందించిన జీఎం**

ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు లేవనెత్తిన భద్రతా అంశాలపై జీఎం వెంకటాచారి సానుకూలంగా స్పందించారు. కంట్రోల్ యూనిట్లను ప్రత్యేక గదికి తరలించే అంశాన్ని పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ప్రమాదంపై పూర్తి విచారణ జరిపి, నాణ్యతా లోపాలు లేదా నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాద స్థలాన్ని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, పిట్ సెక్రటరీలు షణ్ముఖచారి, శ్రీధర్, బిట్టి అశోక్‌కుమార్, రాజేష్ తదితరులు పరిశీలించారు.

## వినాయక వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి..

- **నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు జరుపుకోవాలి..**
- **డీజేలు, అధిక శబ్దాలకు అనుమతి లేదు**
- **శాంతి కమిటీ సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి**




**మణుగూరు, మహా :** వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. వినాయక చవితిని పురస్కరించుకుని మణుగూరు సబ్‌డివిజన్ పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, వినాయక మండపాల నిర్వాహకులతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను ముందుగానే పోలీసులకు అందించాలని సూచించారు. మండపాల వద్ద నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని, విద్యుత్ కనెక్షన్లు, అగ్నిప్రమాదాల నివారణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, మైక్‌సెట్లు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో నిర్దేశిత నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలని, పోలీసులు సూచించిన మార్గాల్లోనే ఊరేగింపులు నిర్వహించాలని చెప్పారు. మద్యం సేవించి ఉత్సవాలు, ఊరేగింపుల్లో పాల్గొనడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడటం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు, విద్వేషపూరిత పోస్టులను ప్రచారం చేయవద్దని సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు. సమావేశంలో మణుగూరు సీఐ నాగబాబు, బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు నగేష్‌కుమార్, రవూఫ్, రాజేష్ తదితర పోలీసు సిబ్బందితో పాటు ఆయా మండపాల కమిటీ సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## సింగరేణి సెక్యూరిటీ వింగ్ అప్రమత్తంగా ఉండాలి

- **జిఎం పర్సనల్ వెల్ఫేర్ సెక్యూరిటీ అధికారి అజయ్ కుమార్**
- **ఎస్ అండ్ పి సి విభాగంపై సుదీర్ఘ చర్చ**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కాలరీస్ కంపెనీలో వివిధ డిపార్ట్మెంట్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ వింగ్ నిరంతరంగా అప్రమత్తంగా ఉండాలని జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ అజయ్ కుమార్ అన్నారు. సింగరేణి వ్యాప్తంగా గల ఎస్ అండ్ పిసి విభాగపు అన్ని ఏరియాల సెక్యూరిటీ అధికారుల సమీక్ష సమావేశం ఎస్ అండ్ పిసి కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగాఅధికారి అజయ్ కుమార్ మాట్లాడుతూ అన్ని విభాగాలలో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏరియాల సెక్యూరిటీ అధికారులకు సూచించారు. ఏరియాలలో దొంగతనాల నివారణకు, సింగరేణి స్థలాల అక్రమణల తీరు చర్యల గురించి వివరించారు. సింగరేణి క్వార్టర్ల ఆక్రమణలు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది వేతనాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ ఇంటెలిజెన్స్ విభాగాల పనితీరు స్క్రాప్ యార్డ్ లో ఏర్పాటు వంటి సెక్యూరిటీ పరమైన అంశాలను చర్చించారు. ఏరియాలలో సీసీ కెమెరాలు నిర్వహణ సక్రమంగా ఉండేలా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్యూరిటీ అధికారి పి.బాలరాజు, కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్ అన్ని ఏరియాలో సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి వాడల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

- **సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి**
- **స్ట్రక్చర్ సమావేశంలో పలు సమస్యలపై సుదీర్ఘ చర్చ**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి వాడల్లో పేరుకుపోయిన ప్రధానమైన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని గుర్తింపు కార్మిక సంఘం నాయకులు సూచించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం ఛాంబర్ నందు మంగళవారం సింగరేణి సంస్థ కార్పొరేట్ ఏరియా పరిధిలోని వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించిన సమస్యల గురించి జిఎం(పర్సనల్)జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటి యూసి) నాయకులతో నిర్మాణాత్మక స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించడం జరిగింది.ఎండి ఎంసి క్వార్టర్ల కాలనీలలో వీధి దీపాలను మెరుగుపరచాలన్నారు. కాలనీలు ప్రధాన ఆసుపత్రిలో కోతుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని కాలనీలలో చెట్ల పొదలను శుభ్రపరచడానికి ఫాగింగ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మెయిన్ వర్క్ షాప్ సెంట్రల్ వర్క్ షాప్ లో పనిచేసే వెల్డర్లకు చేతి గ్లౌసులు లెదర్ బూట్లను అందించాలని పేర్కొన్నారు. సివిల్ ఎస్ అండ్ పిసి విభాగాల ఉద్యోగులకు రెయిన్ కోట్లు అందించాలని తెలిపారు.రోగుల సౌకర్యార్థం ప్రధాన ఆసుపత్రిలో క్యాత్‌ల్యాబ్, సిటి స్కాన్ ఎంఆర్ఐ సౌకర్యాన్ని డ్రైనేజీ వ్యవస్థను కూడా మెరుగుపరచాలని కోరారు. ప్రధాన కార్యాలయంలోని మహిళా ఉద్యోగులకు శిశు సంరక్షణ కేంద్రం భోజనశాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. 133 కేవీ సబ్‌స్టేషన్ ఉద్యోగులకు స్టేషన్ లోపలే ఎఫ్ఆర్ఎస్ మస్టర్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కొత్తగా నిర్మించిన ఎంసి ఎండి రకం క్వార్టర్లను ఎన్‌సిడబల్యూఏ ఉద్యోగులకు మాత్రమే కేటాయించాలన్నారు. అన్వేషణ విభాగంలో శిథిలావస్థలో ఉన్న డ్రిల్స్ క్రేన్‌లను కొత్త వాటితో భర్తీ చేయాలన్నారు. ప్రకాశం స్టేడియంలో జిమ్ ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పైన పేర్కొన్న పది అంశాలపై సుధీర్ఘముగా సమీక్షించి సంస్థ పరిధిలో ఉన్న మేరకు వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని జిఎం(పర్సనల్)జి.వి.కిరణ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిఎం (పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కె.అజయ్ కుమార్, హెచ్ఓడి(ఐటి )బి.హరప్రసాద్, గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటియూసి)బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ఏసిఎంఓ ఎం.ఉష, డిజిఎం(పర్సనల్) ఐఆర్ వింగ్ బి.రాజ గోపాల్, ఎస్ఈ(సివిల్) పి.రాజేంద్ర ప్రసాద్, డివై.పిఎం(ఐఆర్ వింగ్) వి.దేవేందర్ రెడ్డి, డివై.పిఎం పి.కృష్ణ, ఎస్ఈ(ఈ అండ్ఎం) యూ.ఉమామహేశ్వర రావు, డివై.ఎస్ఈ(ఎలెక్ట్రికల్) ఏ.నరేష్ బాబు, కార్పొరేట్ ఏరియా ఏఐటియూసి ప్రతినిధులు అనంత లక్ష్మి, ఎం.శ్యామ్ కిరణ్, ఇతర సంబంధిత డిపార్ట్మెంట్ల అధికారులు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

**బెల్లంపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను వారి ఇళ్ల వద్దే ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులను ఎలాంటి స్పష్టమైన కారణాలు లేకుండా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. అరెస్టులతో మా పోరాటాన్ని ఆపలేరు.. ప్రజల కోసం మా గొంతు మరింత బలంగా వినిపిస్తాం అని స్పష్టం చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని బి ఆర్ ఎస్ గొంతును నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజాక్షేత్రంలో ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. అక్రమ అరెస్టులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.అరెస్టు చేసిన వారిలో: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్,పట్టణ అధ్యక్షులు నూనెటి సత్యనారాయణ,జనరల్ సెక్రటరీ విజయ్,సుందర్ రావు,ఆసాది మధు,బండారి ప్రవీణ్,ఈట రాకేష్,సబ్బని అరుణ్,గోలి శివ, చరణ్, రాజులాల్ యాదవ్, గోపి, ఎలిగేటి శ్రీనివాస్, కేంశెట్టి శ్రీనివాస్, ధర్మేందర్, అరుణ్ తదితరులు ఉన్నారు.




# సమాజంలో గురువులది కీలక పాత్ర

- ట్రస్మా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం
- కలెక్టర్ ఎస్పీ మున్సిపల్ చైర్ పర్సన్ సందేశాలు

**ఆదిలాబాద్ మహా** : విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఆదర్శ పౌరులుగా మలచడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన హాజరయ్యారు.ఆదిలాబాద్ వంటి మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ప్రైవేట్ పాఠశాలలు విద్యాభివృద్ధికి విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 59 వేల మంది, ప్రైవేట్ పాఠశాలల్లో దాదాపు 49 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు సమాజంలో వస్తున్న మార్పులపై పూర్తి అవగాహన లేకపోవచ్చని, ఆ లోటును ఉపాధ్యాయులు పూడ్చి విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, జీవన నైపుణ్యాలను అందించాలని సూచించారు.ఉపాధ్యాయులు విద్యను బోధించడమే కాకుండా విద్యార్థులను భవిష్యత్ 'నేషన్ బిల్డర్స్'గా తీర్చిదిద్దే బాధ్యతను నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జీవితంలో తాము ఏ స్థాయికి చేరుకున్నా, తమ ఎదుగుదలలో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని విద్యార్థులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. డ్రగ్స్ సమస్యపై విద్యార్థులకు అవగాహన కల్పించి, వారు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జీవితంలో ఏ రంగంలో ఎదిగినా, ఏ ఉన్నత స్థానానికి చేరుకున్నా దాని వెనుక గురువుల ఆశీస్సులు, వారి మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష అన్నారు. తన రాజకీయ ప్రస్థానంలోనూ గురువుల పాత్ర ఎంతో కీలకమని అనూష గుర్తుచేసుకున్నారు. తాను మొదటిసారి రాజకీయ రంగప్రవేశం చేసినప్పుడు తీసుకున్న సర్టిఫికెట్ ను కూడా గురువు చేతుల మీదుగానే అందుకున్నానని, అది తన జీవితంలో అత్యంత గొప్ప అచీవ్‌మెంట్ అన్నారు.అనంతరం ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను మెమంటోలతో సత్కరించి శాలువాలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి మాధవి, ట్రాస్మా ప్రతినిధులు పవన్‌రావు, ఆదినాథ్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

- ఆసుపత్రి నిర్వహణ పక్కాగా ఉండాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**హసన్ పర్తి,మహా** : ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వ్యాక్సిన్ గది, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ గది, సిబ్బంది గది, నర్సుల గది, ఇంజక్షన్ రూమ్, ల్యాబొరేటరీ, ఫార్మసీ, టాయిలెట్స్, తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను కలిసి వారు ఏ సమస్యతో వైద్య సేవల కోసం వచ్చారో కలెక్టర్ ఆరా తీశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది స్పందన, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలతో పాటు నిర్వహణ పటిష్టంగా ఉండేలా చూసు కోవాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులు,సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది అందుబాటులో ఉండేలా షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించాలని, ప్రతి షిఫ్ట్‌లో అవసరమైన సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండేలా పర్యవేక్షించాలని వైద్యాధికారిని ఆదేశించారు. హాస్పిటల్ నిర్వహణ పక్కాగా ఉండాలని..రోగులకు మెరుగైన వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



# రెస్టారెంట్ లో అగ్ని ప్రమాదం

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన గల ఓ రెస్టారెంట్ కిచెన్‌లో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. హోటల్ సిబ్బంది వంట చేస్తుండగా తందూరి బట్టి నుంచి పొగలు వ్యాపించి మంటలు చెలరేగాయి. కిచెన్ తో పాటు హోటల్ మొత్తం పొగతో నిండిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు హోటల్ సిబ్బంది మంటలార్పే ప్రయత్నం చేసారు. ఎవరికీ ఎలాంటి అపాయం జరకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# తాత మధు సభ్యత్వం రద్దు చేయాలి

**ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్**



**యాదాద్రి భువనగిరి సెప్టెంబర్ 8 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినటువంటి తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలని సభ్యత్వం రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తూ సుభాష్ సెంటర్లో నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి ఉత్త టూరు సర్పంచ్ కోళ్ల రామకృష్ణ బొడ్డు సాలయ్య బందెల నగేష్ నోముల ప్రవీణ్ మేడి శ్రీనివాస్ నోముల విష్ణు మేడి స్వామి నోముల కృష్ణ చిప్పలపల్లి జితేందర్లు పాల్గొన్నారు



# గని ప్రమాదంపై స్పందించిన ఎమ్మెల్యే

**కార్మికులకు అండగా ఉంటామని భరోసా**

**బెల్లంపల్లి, మహా:** మందమర్రి ఏరియాలోని కాసిపేట2 ఇంక్లైన్ గనిలో జరిగిన ప్రమాదంపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పందించారు. సింగరేణి జీఎం, సూపరింటెండెంట్ ని ఫోన్‌లో సంప్రదించి ప్రమాద వివరాలతో పాటు గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మిడిల్ షిఫ్ట్‌లో 18 డిస్ట్రిక్ట్, 22 లెవల్ నార్త్ ప్రాంతంలో బ్లాస్టింగ్ అనంతరం మాన్‌హోల్ చేస్తుండగా పేలుడు సంభవించడంతో జి. రమేష్, రాజ్ కుమార్, క్రాంతి కుమార్, పి. శ్రీనివాస్ గాయపడినట్లు అధికారులు తెలిపారు. వైద్య చికిత్సల నిమిత్తం ప్రస్తుతం వారికి శ్రీరాంపూర్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.గాయపడిన కార్మికులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. "కార్మికుల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చారు.ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి, భద్రతా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సింగరేణి అధికారులకు సూచించారు.




# మాజీ మంత్రులపై పోలీసుల దాడి అమానుషం

- భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ధర్నా ఆందోళన

**మందమర్రి, మహా** : మాజీ మంత్రులపై పోలీసుల దాడి అమానిషమని భారత రాష్ట్ర సమితి నేతలు అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర రాజధాని అసెంబ్లీ వద్ద మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి లపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ మందమర్రి సింగరేణి పాఠశాల ముందర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థూపం ముందు ధర్నా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మహిళా నాయకులను, గౌరవించకుండా చీరలు లాగడం, మెడలు పట్టుకోవడం, విచక్షణారహితంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని వారు గ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నేతలు పాలక ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. తక్షణమే దాడి చేసిన వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని కోరారు. రోడ్డుపై ఆందోళన నిర్వహిస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బండారు సూరిబాబు, మేడిపల్లి సంపత్, ఓ, రాజశేఖర్, బత్తుల శ్రీనివాస్, కొంగల తిరుపతిరెడ్డి, బోరిగం వెంకటేష్, పంజాల ఈశ్వర్,బార్ల సదానందం,మహిళా నాయకురాళ్లు, కళ్ళపెల్లి సుగుణ, జెరీనా ,ఎనగందుల లక్ష్మి, అమృత రమాదేవి, చిప్పకుర్తి రేఖ, లలిత, బిల్లా ఉమా రెడ్డి,బండి రామ, కొమురక్క, శారద, వరలక్ష్మి, వినోద ,పర్వీన్, రజిత, పద్మ, రోజా, రామ దేవి, గీత మేడిపల్లి మల్లేష్, కనకం రవి, పల్లె నర్సింగ్, దాసరి రాజనర్సు, గాలిపెల్లి తిరుపతి, మొగురం శ్రీనివాస్, శేఖర్ యాదవ్, శివ నాయక్,సురేందర్, వోద్దాం సాగర్, కొడం శ్రీనివాస్, రవి వర్మ, రమేష్, అల్లంల పౌవులు, మటన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేసే వరకు పోరాటం: నరేందర్

**వరంగల్, కాశీబుగ్గ, సెప్టెంబర్ 8 (మహా):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. కాశీబుగ్గ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీల అమలులో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని విమర్శించారు. హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై దాడిని ఖండించారు.



# పోలీసులు మీకోసం

**ఆదిలాబాద్ మహా**: ప్రజలకు చేరువై సమస్యలను తెలుసుకోవడం, గ్రామాల్లో పోలీసుప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడం కోసం 'పోలీసులు మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తలమడుగు మండలం ఉమ్రి గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. దేవాపూర్ , తలమడుగు గ్రామాలలో ఏర్పాటు చేసిన 26 సీసీటీవీ కెమెరాలను గ్రామస్తులతో కలిసి ఎస్పీ ప్రారంభించారు. ప్రతి గ్రామం సీసీటీవీ నిఘాలో ఉంటే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని అన్నారు. గ్రామ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, సీసీటీవీలు ప్రజల రక్షణకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలు, యువతకు అవగాహన కల్పించారు. గంజాయిపై యుద్ధం చేయాలని మార్పు వల్లే గంజాయిని సమాజం నుంచి దూరం చేయవచ్చన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా లేదా మాదకద్రవ్యాల వ్యాపారం నిర్వహిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, గంజాయి రహిత సమాజ నిర్మాణమే జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు. చదువు పట్ల ఉన్న ఆవశ్యకతను తెలియజేశారు విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి అని తెలిపారు. ఆదిలాబాద్ లోని ప్రైవేటు వైద్యుల చే ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసారు. దాదాపు 250 మంది గ్రామస్తులకు జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ, డెంటల్, పీడియాట్రిషన్ విభాగాలలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేసారు. అనంతరం కబడ్డీ విజేతలకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్ఐ డి రాధిక, పట్టణ డాక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, శిల్పా సందీప్, అనిషా, భార్గవ్ కృష్ణ, శ్రీనివాసచారి, ఉమ్రి సర్పంచ్ మెస్రం సావిత్రిబాయి, కోసాయి గ్రామ సర్పంచ్ శైలజ, గ్రామ పెద్దలు పెందూరు వనమాల, కుమ్ర రామారావు, పెందూరు మాధవరావు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు సుమారు 250 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**ఆదిలాబాద్ మహా** : విమానాశ్రయం నిర్మాణ ప్రక్రియలో భాగంగా అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను అత్యంత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో విమానాశ్రయం నిర్మాణ ప్రక్రియపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రక్రియ, విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులకు సంబంధించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా రైతులు, గ్రామస్థులతో మాట్లాడి, భూసేకరణకు సంబంధించి రేట్లను ఫైనలైజ్ చేసి తదుపరి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆయా సర్వే నంబర్లకు సంబంధించిన పెండింగ్ దస్తావేజులను త్వరితగతిన పరిష్కరించి, అవసరమైన అదనపు ఎక్సెంప్షన్ ప్రపోజల్స్ ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, సర్వే, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రూ, ఎస్.రాజేశ్వర్, డిప్యూటి కలెక్టర్ వంశీ కృష్ణ, ఆర్డీవో జగదీశ్వర్ రావు, భూ సర్వే కొలతల శాఖ ఏడి ప్రభాకర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# గణేష్ ఉత్సవాలకు మున్సిపల్ ఏర్పాట్లు

**ఆదిలాబాద్ మహా:** అదిలాబాద్ పట్టణంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ సమావేశమందిరంలో నిర్వహించిన శాంతికమిటీ సమావేశానికి ఆమె కలెక్టర్ రాజర్షి షా , ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు మత పెద్దలు పాల్గొని, ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా మున్సిపాలిటీ తరపున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్ పర్సన్ తెలిపారు.గణేష్ మండపాలు ఉత్సవ ప్రాంతాల్లో పారిశుద్ధ్య ఏర్పాట్లు,అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడం,గణేష్ నిమజ్జన మార్గాల్లో రోడ్ల శుభ్రత మరమ్మతులు,ఉత్సవ ప్రాంతాల్లో చెత్త తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ,నిమజ్జన కార్యక్రమాలకు అనుగుణంగా మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచడం లాంటి ప్రధానమైన పనులు చేపట్టి ప్రజలకు, ఉత్సవ కమిటీ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు.గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా మున్సిపాలిటీ తరపున పూర్తి సహకారం అందిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరస్పర సహకారంతో పండుగను సోదరభావంతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, సబ్ కలెక్టర్ కే. ప్రణయ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి**

**జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న**



**వరంగల్, కార్పొరేషన్ మహా ;** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులను, బిల్లుల చెల్లింపుల నిమిత్తం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ముందుగా 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీ, ప్రకాశరెడ్డి పేట ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం 22వ డివిజన్ లోని పోచమ్మ మైదాన్, 21వ డివిజన్ ఎల్బీనగర్, 36వ డివిజన్‌లోని చింతల్, 38వ డివిజన్‌లోని ఖిలా వరంగల్ ప్రాంతాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మంచినీటి పైప్‌లైన్‌ల నిర్మాణ పనుల నాణ్యతను కమిషనర్ పరిశీలించారు. పోచమ్మ మైదాన్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కూడా పరిశీలించి, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పనుల పూర్తికి ముందు అధికారులు క్షేత్రస్థాయిలో నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్ బాబు, డీఈలు, ఏఈలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ సుమ



**వరంగల్,గీసుగొండ మహా :** వరంగల్ జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ ఆర్డీఓ సుమ సోమవారం పరిశీలించారు.గీసుగొండ మండలం ఎల్కుర్తి హవేలి గ్రామంలో తహసీల్దార్ రియాజుద్దీన్ తో కలిసి రీ సర్వే పనులను పరిశీలించి, సర్వే ప్రక్రియ పురోగతిపై అధికారులతో సమీక్షించారు.

అనంతరం సంగెం మండలం ముమ్మిడివరం గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను సందర్శించి పరిశీలించారు. రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రీ సర్వే లో ఆర్డిఓ వెంట సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలి

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్**

**ట్యాంక్ బండ్ , మహా :** హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు మాల సంఘాలు నిరసన వ్యక్తం చేశారు దళితుడు మాల సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని ఆయన పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తక్షణమే స్పీకర్ కి క్షమాపణ చెప్పాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు బిఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్పాలని కెసిఆర్ కేటీఆర్ వెంటనే స్పీకర్ కి మాల సామాజిక వర్గానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని మాల మహానాడు మరియు వివిధ మాల సంఘాల డిమాండ్ చేశాయి. జి చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో మన్నే శ్రీధర్ రావు బేర బాల కిషన్ మంచాల లింగస్వామి దాసరి విశాల్ బిట్ల వెంకటేశ్వర్లు జంగా శ్రీనివాస్ బలవంతరావు ఆవుల సుధీర్ తాలూకా అనిల్ నాందేవ్ తాలూకా రాజేష్ అంజలి కుమారి శంకర్ సుదర్శన్ అద్దంకి ఆనంద్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు



## గ్రామపంచాయతీలో రెండు వర్గాలుగా విడిపోయిన
# వార్డు సభ్యులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు

- **నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టిన ఎంపీ ఓ..**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి,ఉప సర్పంచ్లు జట్టుగా ఏర్పడి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఇటీవల వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పంచాయతీ అధికారి మోహన్ సురేష్ కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారి ఆదేశాల మేరకుశంషాబాద్ మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) రమేష్ మంగళవారం మదనపల్లి కొత్త తండా గ్రామపంచాయతీకి చేరుకొని సర్పంచ్ ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి తో పాటు వార్డు సభ్యుల సమక్షంలో విచారణ చేసి రికార్డులను పరిశీలించారు.

**నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణల**

నేపథ్యంలో విచారణ చేస్తున్నట్లు ఎంపీ ఓ తెలిపారు. గ్రామ రెవెన్యూ పరిధిలో పలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు, ఫామ్ హౌస్ లో నిర్మిస్తున్న వాటికి ఇంటి నంబర్లు కేటాయిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు వార్డు సభ్యులు అధికారి దృష్టికి తెచ్చారు. క్షేత్రస్థాయి లో పరిశీలించి ప్రతి అంశంపై విచారణ జరిపి ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తానని ఎంపీ ఓ రమేష్ గౌడ్ వివరించారు.

**సర్పంచ్ భర్త ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి...**

శంషాబాద్ మండలం మదనపల్లి కొత తండా గ్రామ పంచాయతీలో సర్పంచి భర్త ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని మాజీ సర్పంచ్ దేవా నాయక్ వార్డు సభ్యులు రాందాస్, భాస్కర్, బాబు, విచారణ అధికారిని కోరారు.గ్రామపంచాయతీలో సర్పంచ్ ఉపసర్పంచ్ పంచాయతీ కార్యదర్శి కలసి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ పంచాయతీలో అభివృద్ధి పనులు నోచుకోవడం లేదని తెలిపారు. జిల్లా కలెక్టర్ డీపీఓ తో పాటు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ భర్త ఆగడాలపై విచారణలో తాము పలు కీలక ఆధారాలు అధికారికి అందజేసినట్లు తెలిపారు.




## సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ ను
# విజయవంతం చేద్దాం

- **జిల్లా నుండి 10 వేల మందిని తరలింపునకు ఏర్పాట్లు**
- **రంగారెడ్డిజిల్లా చైర్మన్ కన్వీనర్లు ఊటు యశ్వంత్, డాక్టర్ రామారావు**

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 8 మహా:** రాష్ట్ర TGEJAC పిలుపు మేరకు సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ ప్రోగ్రాం ను విజయవంతం చేయడానికి ఈరోజు రంగారెడ్డి జిల్లా TGEJAC చైర్మన్ ఊటు యశ్వంత్ కన్వీనర్ డాక్టర్ రామారావ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా లోని ఇబ్రహీంపట్నం డివిజన్, కందుకూరు డివిజన్, రాజేందర్ నగర్ డివిజన్ లలో అనేక కార్యాలయాలకి వెళ్లి ఉద్యోగస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి చలో హైదరాబాద్ కు సమాయత్తం చేయడం జరిగింది. ఉద్యోగస్తులు అందరు 10న చలో హైదరాబాద్ కు అందరు తరలి రావడానికి సిద్ధం గా ఉన్నారని ఉద్యోగస్తుల లో మంచి స్పందన కనపడుతుందని, మరియు ఈ జిల్లా నుండి 10వేల మందికి పైగా తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తూ జిల్లా లోని ప్రతి డివిజన్ స్థాయిలలో ఉద్యోగస్థులు టీచర్స్, పెన్షనర్స్ తో సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగింది. రంగారెడ్డి జిల్లా TGEJAC చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డాక్టర్ రామారావు, TNGO సెక్రటరీ శ్రీనివాస్, TGO కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, శాంతిశ్రీ, గోపాల్ నాయక్, వెంకటప్ప, నాగార్జున, నూతనకంటి వెంకట్, శ్రీనివాస్ మరియు టీచర్స్ యూనియన్ నాయకులు ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు...

# నిర్లక్ష్యపు నీడలో కరెంట్ స్తంభం...

**తీగలతో అల్లుకున్న కరెంటు స్తంభం...**
**ఆగమరిస్తే తప్పదు ప్రమాదం....**

**రాజేంద్రనగర్ మహా :** కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు పిచ్చి మొక్కలు, చెట్ల తీగలు అల్లుకోవడంవల్ల వర్షాకాలంలో విద్యుత్ సరఫరా జరిగి విద్యు త్ షాక్ గురయ్యే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. కాటేదాన్ డివిజన్ పరిధిలోని బిస్కెట్ కంపెనీ రోడ్డులో ప్రమాదకరంగా ట్రాన్స్ఫార్మాలు ఉన్నాయి. కాటేదాన్ ఏఈ కి ఎలక్ట్రిసిటీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దారి గుండా వచ్చి పోయే కార్మికులకు మూగ జీవల ప్రాణాలకు ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫర్మర్లను పైకి లేపి వచ్చిపోయే



ప్రయాణికులను, ప్రజలను కాపాడాలని తెలిపారు. ఇలాంటి ప్రమాదకరమైన ట్రాన్స్ఫారాలు ఇంకా చాలా ఉన్నాయి వీటిని వెంటనే మరమ్మతులు చేసి ప్రజల, మూగజీవుల ప్రాణాలను కాపాడాలని కోరారు.

## స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన అనుచిత వ్యాఖ్యలకు
# తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు...

**ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..**
**కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం..**
**శంషాబాద్లో కాంగ్రెస్ పార్టీ నిరసనలు...**




**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు శేఖర్ ఆధ్వర్యంలో శంషాబాద్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. నిరసనలో జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి,ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ పల్లి నరేందర్, సాన్నెం శ్రీనివాస్ గౌడ్, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి పాల్గొన్నారు.బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్ రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన స్థానానికి కనీస గౌరవం ఇవ్వకుండా ఎవడ్రా' స్పీకర్ గాడు అంటూ ఏకవచనంతో సంబోధించడమే కాకుండా, అధికారం ఇచ్చిన వాడు ఎవడ్రా' అంటూ తీవ్ర అసభ్య పదజాలంతో బూతులు తిట్టడం బీఆర్ఎస్ నేతల అహంకారానికి, దళిత వ్యతిరేక మనస్తత్వానికి అద్దం పడుతోందని మండిపడ్డారు.దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అసభ్యకర పదజాలంతో దూషించిన తాతా మధును తక్షణమే ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.స్పీకర్‌ను అవమానించిన సదరు ఎమ్మెల్సీల సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు, బీఆర్ఎస్ పార్టీ నుంచి వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రణధీర్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి మైలారం సులోచన. సర్పంచ్లు కోటేశ్వర గౌడ్, రవినాయక్, ఆంజనేయులు, ప్రభాకర్ గౌడ్, శేకేర్ యాదవ్,లింగం, గోపాల్ నాయక్, సతీష్ యాదవ్,శ్రీనివాస్ రెడ్డి, పృధ్వి గౌడ్, పదమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్, ధనుంజయ్ ఇంద్రాపాల్ రెడ్డి ,ప్రవీణ్, మహేందర్, గోవర్ధన్ రెడ్డి, , శ్రీధర్ యాదవ్, భాషా భాయ్ , ప్రభాకర్ యాదవ్, ఉమామహేష్, ఫకృద్దీన్, ప్రభాకర్, సాయి ముదిరాజ్, నజీర్ భాయ్, మిట్టు, అశోక్, ఫక్రుద్దీన్, బంగారం కుమార్, మహేష్ గౌడ్, చందు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు
## సత్తుపల్లిలో నిరసన జ్వాల

**సత్తుపల్లి, సెప్టెంబర్ 8:మహా** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. సత్తుపల్లి రింగ్ సెంటర్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన నిర్వహించి తాతా మధు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని మండిపడ్డారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తులపై వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. స్పీకర్ పట్ల చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండేలా అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బి.ఆర్.ఎస్ పార్టీ దళిత వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు.

## స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా
# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన

**.. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో**



**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు మంగళవారం నాడు ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర టి పి సి సి, డిసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచనలతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు .ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ లు సంయుక్తంగా మాట్లాడుతూఅణగారినవర్గాలు ఉన్నత పదవుల్లో కూర్చుంటే దొరలు చూస్తూ ఊరుకోలేరా ? స్పీకర్ గడ్డం ప్రసాద్ ని కనడమే ఆ తల్లి చేసిన నేరమా?,స్పీకర్ ను దూషించిన బిఆర్ఎస్ పార్టీ దొరల అహంకారాన్ని అణచేస్తాం అని హెచ్చరించారు.దళిత స్పీకర్ ను అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలని,దళితులంటే ఎందుకు కల్వకుంట్ల దొరలకు ఇంత బలుపు?, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ రాజకీయాల్లో సిగ్గుమాలినతనానికి అన్ని హద్దులను టిఆర్ఎస్ పార్టీ హద్దులు మీరిందనీ, దీనిని గూండాయిజం కాదని ఎవరు అనగలరు? దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ని, టిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు దూషించడం. దళితులను ఎప్పుడూ అవమానించే బీఆర్ఎస్ పార్టీ నైజానికి ఇది నిదర్శనం. అని,మహిళా పోలీసు అధికారుల సమక్షంలో హరీష్ రావు తన టీషర్ట్‌ను తొలగించి, వారిని అసౌకర్యానికి గురిచేశారని,పోలీసు అధికారుల పట్ల టిఆర్ఎస్ పార్టీ నేతలు నాయకులు దూకుడుగా ప్రవర్తించడం కెమెరాలో రికార్డయిందని గుర్తు చేశారు. తాతా మధుపై చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదనీ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గౌరవం కోసం స్పీకర్ గౌరవాన్ని అవమానిస్తే చూస్తూ ఊరుకోం అని, రాజకీయ విమర్శలు చేయడం వేరు.. చెప్పరాని భాషలో స్పీకర్ తల్లిని అవమానించడం బీఆర్ఎస్ నీచబుద్ధికి నిదర్శనం అని తీవ్రంగా విమర్శించారు.కార్యక్రమంలో 15వ వార్డ్ కౌన్సిలర్ చింతల వసంత, పిసిసి మెంబర్ చిలుముల శంకర్ , మీడియా ఇంచార్జ్ దేవసాని ఆనంద్, నాయకులు గల్లి రాజలింగు,దామెర శ్రీనివాస్లమ్మికుంట విజయ్,పొరండ్ల సత్యవతి , ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు ఆదర్శ వర్ధన్, దుబాసి వెంకటస్వామి, పట్టణ ఉపాధ్యక్షులు వాజిద్ బాయ్, ఖలీల్ నేతలు అరకొండ మొండి , దాసరి రాజలింగు, పెరంపెల్లి పరమేష్, సాయి కిరణ్, పట్టణ కార్యదర్శులు, గుజ్జ రవి, , సూరం బానేష్, మాజీ కౌన్సిలర్లు.. రాసబత్తుల వెంకటి , నక్కా కృష్ణ, పంగా భరత్, మీర్జా ఖదీర్ బేగ్,చుంచుల వెంకటలక్ష్మి, యల్లా తులస, మీసాల పద్మ , ఎలుక ఆకాష్, SK అలీ, గద్దల కుమార్,శేఖర్ శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో సీటు కోసం వెబ్ ఆప్షన్స్ ఉపయోగించుకోవాలి

- **ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్**
- **అందుబాటులో ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ ఇంగ్లీష్, ఎంకాం కోర్సులు**
- **సిపి గెట్-2026లో ఉత్తీర్ణులైన, ఉత్తీర్ణులు కానీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అవకాశం**
- **ప్రిన్సిపాల్,డాక్టర్ కాంపల్లి శంకర్**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంకాం కోర్సులలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ , ఎం ఏ ఇంగ్లీష్, ఎంకాం కోర్సులను సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 202627 విద్యా సంవత్సరంలో పీజీలో ప్రవేశానికి కాను టీజీ సిపి గెట్ 2026 రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఉత్తీర్ణులు కాని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.*8, 9, 10వ తేదీల్లో వెబ్ ఆప్షన్స్... ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో సీటు కోసం మొదటి ప్రాధాన్యత గా ఆప్షన్ పెట్టుకోవాలని వివరించారు. 14వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పిజి సెంటర్ విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. బెల్లంపల్లిలో స్థానికంగా లభిస్తున్న అవకాశాన్ని విద్యార్థులు వినియోగించు కోవాలని సూచించారు.

# తాతా మధును బర్తరఫ్ చేయాలి..

**మణుగూరు, మహా :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం మణుగూరులో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్సీ పదవి నుంచి ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, డీసీసీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న పిలుపు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాసనసభలో స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం ఉందని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను కించపరచడమేనన్నారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని పేర్కొన్నారు. తాతా మధు వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**- దిష్టిబొమ్మ లాక్కున్న పోలీసులు**

నిరసనలో భాగంగా తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ కార్యాలయం వద్ద నుంచి దిష్టిబొమ్మతో అంబేద్కర్ సెంటర్‌కు వెళ్లేందుకు కార్యకర్తలు సిద్ధమవుతుండగా పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు.

## తాళాలు వేసిన ఇల్లే ఈ దొంగల టార్గెట్..

**ఐదుగురు సభ్యుల ముఠాలో..**
**ఇద్దరు అరెస్ట్, ముగ్గురి పరార్.**

**రాజేంద్రనగర్ మహా :** గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని ఉట్పల్లిలో సోమవారం రాత్రి జరిగిన దొంగతనం కేసును హైదరాబాద్ ,సీసీఎస్ , శంషాబాద్ పోలీసులు ఛేదించారు. మార్ల ఈశ్వర్ (ఏ4, 22, ) మార్ల నవీన్ (ఏ5 ,23 )ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పసుమాముల గ్రామం, అబ్దుల్లాపూర్మెట్ మండలం, రంగారెడ్డి జిల్లాకు చెందినవారుగా గుర్తించారు.

నిందితులను విచారించగా, తమ సహచరులతో కలిసి శంషాబాద్, ఆదిబట్ల, కడ్తాల్ ప్రాంతాలతో పాటు నల్గొండ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ గా చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారు. నేరాలకు ఉపయోగించిన ఆటో,బజాజ్ పల్సర్, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులనురిమాండ్ కు తరలించారు. పరారీలో ఉన్న (ఏ1 )షఫీ, (ఏ2) యోగి, (ఏ3 )బన్నీల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.



# భగ్గుమన్న దళిత సంఘాలు..

- **సంస్కారహీనుడు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ.!**
- **దళితుల పట్ల అక్కసుతో పరుష పదజాలం!**
- **తాత మధును ఎమ్మెల్సీ నుంచి బర్తరఫ్ చేయాలి**
- **దేశ చరిత్రలో ఏనాడు జరగని దుర్ఘటన....**
- **దళిత వ్యతిరేకి బిఆర్ఎస్ పార్టీ.. బిఆర్ఎస్ ఎంఎల్సీ**
- **గడ్డిఅన్నారం ఏఎంసి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడి**



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 8 మహా:** శాసన సభ స్పీకర్ పై పరుష పదజాలంతో దూషించడం, తెలంగాణ చరిత్రలో చీకటి రోజు అని, ఇది కేవలం స్పీకర్ కే కాదు, 4 కోట్ల ప్రజల ఆత్మగౌరవానికి జరిగిన అవమానమని అన్నారు. మంగళవారం అధికారం కోల్పోయామనే అక్కసుతో దళితుల పట్ల సంస్కార హీనంగా ప్రవర్తించి, శాసనసభ స్పీకర్ పై పరుష పదజాలంతో దూషించిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధుని తక్షణమే బర్తరఫ్ చేయాలని, ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో చావు డప్పు కొట్టి, ఎంఎల్సీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దళిత విభాగం పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాలనుసారం, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొంకని విజయ్ కుమార్ మాదిగ ఆధ్వర్యంలో, దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కించపరిచే మాటలు మాట్లాడిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధుని తక్షణమే బర్తరఫ్ చేసి, కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులు, పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

**అధికారం కోల్పోయామనే అక్కసుతో...**

భారత రాజ్యాంగం కల్పించిన అత్యున్నతమైన పవిత్ర పీఠంపై ఆసీనులై ఉన్న దళిత పౌరుడు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై, దొరల గడిల బానిస ఎమ్మెల్సీ, తాతా మధు ఇష్టానుసారంగ నోరుపారేసుకోవడం బిఆర్ఎస్ పార్టీ యొక్క దళిత వ్యతిరేక వైఖరికి అహంకారానికి నిదర్శనమని ఏఎంసి చైర్మన్ అన్నారు. అధికారం కోల్పోయామనే అక్కసుతో దళిత నాయకత్వం ఎదుగుతుంటే చూసి ఓర్వలేక రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచేలా మాట్లాడటం బిఆర్ఎస్ పార్టీ సంస్కారహీనతకు పరాకాష్టగా మారిందని ఆయన అన్నారు. శాసనసభ స్పీకర్ తల్లిని అవమానించేలా మాట్లాడటం, తెలంగాణ సమాజానికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని, మనందరం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా మనం వ్యవహరిస్తూ, ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలని తెలిపారు. దేశ చరిత్రలో వేనాడు జరగని దుర్మార్గం.... భారతదేశ చరిత్రలో ఏ చట్టసభల్లోనూ ఇలాంటి దుర్మార్గమైన, హేయమైన సంఘటన జరగలేదని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి సభ్యుడు మాట్లాడాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఇంతటి దుర్మార్గమైన మాటలు ఎవరూ మాట్లాడలేదు. సభా మర్యాదను కించపరిచిన సభ్యుడిని వెంటనే అనర్హుడిగా ప్రకటించాలని, ప్రతిపక్ష నాయకులు సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రాకుండా వారిని ప్రోత్సహించిన బిఆర్ఎస్ ప్రతి పక్షనేత కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు క్యారగారి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కొత్తకుర్మ శివకుమార్, రాచర్ల వెంకటేశ్వర్లు, మంకాల దాసు, కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ఎండి గౌస్ పాషా, సింగల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్స్ నీళ్ల భాను, దారు రాఘవేంద్ర, దొంతరమోని భార్గవి రాజు, రామదాస్ నాయక్, మార్కెట్ డైరక్టర్ మహేష్ గౌడ్, రమాకాంత్ రెడ్డి, బుగ్గ రాములు, కోడూరు రమేష్, ఈగల రాములు, ఏర్పుల రాజు, సతీష్, సత్య వాణి, శ్రీనివాస్ చారి, ప్రేమ్, పి రమేష్, దశరథ, భాను, సుమన్, కిరణ్, నగేష్, అయాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# కూతురిగా.. హీరోయిన్‌గా.. అనస్వర రాజన్‌కు కలిసొచ్చేదేది?



మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ తన సహజమైన నటనతో యువ కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పటికే తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'కాకా' సినిమాలో కీలక పాత్రకు ఎంపికైంది. అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన స్పెషల్ పోస్టర్‌లో ఆమె పాత్రను అధికారికంగా పరిచయం చేసింది.

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కాకా' సినిమాలో అనస్వర రాజన్.. చిరంజీవి కూతురు 'అమ్ములు'గా కనిపించనుంది. తండ్రీకూతుళ్ల అనుబంధం సినిమాలో కీలకమైన ఎమోషనల్ పాయింట్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో అనస్వర ఎంబీబీఎస్ విద్యార్థినిగా సింపుల్ లుక్‌లో కనిపించనుంది. చిరంజీవికి కూతురిగా నటించే అవకాశం రావడంతో ఆమె పాత్రపై ఆసక్తి నెలకొంది.

అనస్వర రాజన్ గతేడాది 'ఛాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. రోషన్ మేక హీరోగా, ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఓ మోస్తరు విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఆమె హీరోయిన్‌గా 'అంతా రాములోరు చూస్కుంటారు' సినిమాలో నటిస్తోంది. సంగీత్ శోభన్ హీరోగా, పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ధీరజ్ మొగిలినేని, గిరిబాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన వచ్చింది. ఇందులో అనస్వర 'శిరీష' పాత్రలో కనిపించనుంది.

**రెండు సినిమాలు.. రెండు విభిన్న పాత్రలు**

ఒకవైపు మెగాస్టార్ చిరంజీవికి కూతురిగా కీలకమైన పాత్రలో నటిస్తుండగా.. మరోవైపు యువ హీరోకు జోడీగా హీరోయిన్‌గా సందడి చేయనుంది అనస్వర రాజన్. రెండు సినిమాలు కూడా భిన్నమైన కథలు, పాత్రలతో తెరకెక్కుతున్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. మరి చిరంజీవి కూతురిగా చేసిన 'కాకా' సినిమా ఆమెకు మంచి గుర్తింపు తెస్తుందా? లేక హీరోయిన్‌గా నటిస్తున్న 'అంతా రాములోరు చూస్కుంటారు' ఆమె కెరీర్‌కు మరింత ప్లస్ అవుతుందా? అనేది తెలియాలంటే సినిమాల విడుదల వరకు వేచి చూడాల్సిందే.



# 'మీర్జాపూర్' లా ధైర్యం చేసే దమ్మెంత ఎంత మందిలో ఉంది?

**డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో సుదీర్ఘంగా సాగే వెబ్ సిరీస్‌లను మూడు గంటల సినిమాగా మలచడం అనేది చిన్న విషయం కాదు.**

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో సుదీర్ఘంగా సాగే వెబ్ సిరీస్‌లను మూడు గంటల సినిమాగా మలచడం అనేది చిన్న విషయం కాదు. ఎంతో రిస్క్ తో కూడిన వ్యవహారం. ఏమాత్రం తేడా కొట్టినా? వెబ్ సిరీస్ ని చెడదీసారు అనే నింద మోయాల్సి వస్తుంది. అయితే హిందీ పాపులర్ క్రైమ్ డ్రామా \మీర్జాపూర్\ మేకర్స్ ఈ సవాలును స్వీకరించి బాక్సాఫీస్ వద్ద విజయం సాధించారు. ఓటీటీలో 14 గంటల నిడివితో మూడు సీజన్లుగా అలరించిన మీర్జాపూర్‌ను మూడు గంటల థియేట్రికల్ సినిమాగా మలచి వందల కోట్ల వసూళ్లతో గ్రాండ్ విక్టరీ కొట్టడం భారతీయ సినీ చరిత్రలోనే సరికొత్త అధ్యాయానికి తెర తీసింది.ఓటీటీలో విడుదలైన సిరీస్‌లను ప్రేక్షకులు ఇప్పటికే ఇళ్లలోని చిన్న తెరలపై వీక్షించారు. అలాంటి కథను మళ్లీ డబ్బులు పెట్టి థియేటర్లలో చూస్తారా? అనే సందేహాలను మీర్జాపూర్ చిత్రం పూర్తిగా పటాపంచలు చేసింది. కేవలం ఓటీటీ వీక్షకులను మాత్రమే కాకుండా థియేటర్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా స్క్రీన్‌ప్లేను తీర్చిదిద్దడం, లార్జర్ ద్యాన్ లైఫ్ విజువల్ ఎఫెక్ట్స్ , థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించడమే ఈ సినిమా సాధించిన ఘన విజయానికి ప్రధాన కారణం.14 గంటల కంటెంట్‌ను ఏ మాత్రం స్వారస్యం తగ్గకుండా పాత్రల ఉద్వేగాలను చెడగొట్టకుండా కేవలం 3 గంటల సునిశితమైన డ్రామాగా కుదించడం మామూలు విషయం కాదు. ప్రతి పాత్ర నేపథ్యం, కథలోని మలుపులను థియేటర్ సీట్లకు హత్తుకునేలా ఎడిట్ చేసి సమర్పించడంలో దర్శకు,రచయితల ప్రతిభ స్పష్టంగా కనిపిస్తుంది. కథపై, కంటెంట్‌పై ఉన్న బలమైన నమ్మకమే వారిని ఈ నిర్ణయం దిశగా నడిపించి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించేలా చేసింది. అయితే మీర్జాపూర్ సాధించిన ఘనవిజయం తర్వాత ఇప్పుడు పరిశ్రమలో మరో ప్రశ్న మొదలైంది. ఇలాంటి సాహసోపేతమైన ప్రయోగం చేసే ధైర్యం, దమ్ము ఇంకెంతమంది దర్శకులకు ఉందనేది ఆసక్తికరంగా మారింది. దేశంలో \ది ఫ్యామిలీ మ్యాన్\, \పా తాళ్ లోక్\, \స్కామ్ 1992\, టాలీవుడ్‌లో వచ్చిన \సేక్రెడ్ గేమ్స్\ వంటి ఎన్నో విజయవంతమైన సిరీస్‌లు ఉన్నాయి. కానీ వాటిని బిగ్ స్క్రీన్ ఫార్మాట్‌కు తగ్గట్టుగా మార్చి విడుదల చేసే ఆలోచన చాలామందికి ఇంకా రావడం లేదు.

వెబ్ సిరీస్‌ను సినిమాగా మార్చడానికి కేవలం కథ ఉంటే సరిపోదు. దానికి విపరీతమైన మాస్ ఫాలోయింగ్, థియేటర్‌కు వచ్చేంత క్రేజ్ ఉన్న పాత్రలు, విజువల్ గ్రాండ్‌నెస్ అవసరం. కథలోని కోర్ ఎమోషన్‌ను దెబ్బతీయకుండా వేగవంతమైన కథనంతో రూపుదిద్దే నేర్పు ఉన్న దర్శకులే ఈ ప్రయత్నంలో నెగ్గుకొరాగలరు. లేకపోతే ఓటీటీ కంటెంట్‌నే మళ్లీ థియేటర్లలో రుద్దారు అనే విమర్శలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.ఏది ఏమైనా \మీర్జాపూర్\ సాధించిన విజయం భారతీయ సినిమా రంగంలో సరికొత్త ట్రెండ్‌కు పునాది వేసింది. భవిష్యత్తులో డిజిటల్ దునియా నుంచి థియేటర్లకు వచ్చే సినిమాల సంఖ్య పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రిస్క్ అని తెలిసినా కంటెంట్‌పై నమ్మకంతో ముందడుగు వేసే దార్శనికత ఉన్న దర్శకులు మరింతమంది ముందుకు వస్తే భారతీయ బాక్సాఫీస్ వద్ద మరిన్ని వినూత్నమైన రికార్డులు నమోదవ్వడం ఖాయం.

# హీరోగా కాదు.. విలన్‌గా మనోజ్ కొత్త ఇన్నింగ్స్



మంచు మోహన్‌బాబు కెరీర్ ఆరంభం నుంచే విలక్షణమైన పాత్రలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలినాళ్లలో విలన్‌గా మెప్పించిన ఆయన.. ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హీరోగా విభిన్న పాత్రల్లో కనిపిస్తూ ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు అదే బాటలో ఆయన కుమారుడు మంచు మనోజ్ కూడా ముందుకు సాగాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న మనోజ్.. రీ ఎంట్రీ తర్వాత కేవలం హీరో పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన క్యారెక్టర్స్ ఎంచుకుంటున్నాడు.

**మిరాయ్‌తో నెగటివ్ షేడ్స్**

తేజ సజ్జా హీరోగా నటించిన 'మిరాయ్' సినిమాలో మంచు మనోజ్ పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించాడు. ఇప్పటివరకు హీరోగా ఎక్కువగా చూసిన మనోజ్‌ను ప్రతినాయకుడి పాత్రలో చూడటం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో మనోజ్ నటనకు కూడా ప్రశంసలు దక్కాయి. దీంతో అతడికి మరిన్ని నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు వస్తున్నట్లు సమాచారం.

**దాదాలో పోలీస్ ఆఫీసర్‌గా**

'మిరాయ్' తర్వాత మంచు మనోజ్ నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'దాదా' సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మనోజ్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నట్లు సమాచారం. ఈ పాత్రలో నెగటివ్ షేడ్స్ కూడా ఉంటాయనే ప్రచారం ప్రస్తుతం జోరుగా సాగుతోంది. అయితే చిత్రబృందం నుంచి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**తండ్రి బాటలో తనదైన గుర్తింపు**

మంచు మోహన్‌బాబు తరహాలో నటుడిగా తనను తాను మరింత వైవిధ్యంగా ఆవిష్కరించుకోవాలని మనోజ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హీరోగా మాత్రమే కాకుండా విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా మెప్పించే అవకాశం ఉందని భావిస్తున్నాడు. తన బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే పాత్రలు చేయాలని అనుకుంటున్నట్లు గతంలో వెల్లడించాడు. మంచి కథ, పాత్ర దొరికితే హీరోగా కూడా తప్పకుండా నటిస్తానని చెప్పాడు. దీంతో ప్రస్తుతం నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను బలంగా కొనసాగిస్తున్న మనోజ్.. భవిష్యత్తులో మళ్లీ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# రాయలసీమ జెనెక్స్ స్టార్ బ్రాండ్ అంబాసిడర్‌గా నిధి అగర్వాల్



ఉమెన్ ఆంధ్రాప్రీమియర్ లీగ్.. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతుండగా, భారత్ క్రికెట్ జట్టు ప్లేయర్లు ఉన్న హాట్ ఫేవరెట్ రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టుకు ప్రముఖ నటి, పాన్ ఇండియా హీరోయిన్ నిధి అగర్వాల్ బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారు. కడపలో రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టు జెర్సీ లాంచ్ కు కూడా ఆమె హాజరుకానున్నారు. రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టుకు నిధి అగర్వాల్ శుభాకాంక్షలు తెలిపారు. నిధి అగర్వాల్ ఎన్నో సూపర్ హిట్, అగ్ర హీరోల చిత్రాల్లో నటించారు. ఇస్మార్ట్ శంకర్, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన హరిహరవీరమల్లు, ప్రభాస్ సరసన రాజా సాబ్, అఖిల్, నాగచైతన్య సరసన కూడా నటించింది. బాలీవుడ్ లో టైగర్ ష్రాఫ్ సరసన, తమిళ్ లో శింబు సరసన ముద్దుగుమ్మ నటించింది. పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ ఉన్న హీరోయిన్ నిధి ఉమెన్ ఏపీఎల్ టీమ్ కు మద్దతుగా రావడం, రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టు ఆమెను తీసుకురావడం ఆసక్తికరంగా మారింది. దీంతో రాయలసీమ జెనెక్స్ మొత్తం ఏపీఎల్ లోనే స్పెషల్ గా మారింది. రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టుకు ఆర్టిస్ట్ కో-ఆర్డినేటర్ గా బ్రాండ్ ఎక్స్ఓ వ్యవహరిస్తోంది. ప్రపంచకప్ లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీచరణి వంటి ఎంతోమంది టాలెంటెడ్ ప్లేయర్లు ఇందులో ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com